# ఆడపడుచు



వసుంధర





రాత్రి ఎనిమిది గంటల సమయం. నేలంతా పిండార బోసినట్లు వెన్నెల వెన్నెల్లో జలకాలాడుతోందా అన్నట్లు పెరట్లో అసహనంగా అటు యిటూ పచార్లు చేస్తోంది ముక్త.

ఆమె ఆలోచనలనిండా భర్త గౌతమ్ ఉన్నాడు.

వారిద్దరికీ వివాహమై ఏణ్ణర్థం దాటింది.

పెళ్ళికి ముందు ముక్త జీవితం గురించి ఎన్నోకలలు కంది.

ఆమె తండ్రి బడి పంతులు. అదృష్టం కొద్దీ ముగ్గురే పిల్లలు. అందులో తనొక్కర్తే ఆడపిల్ల.

గారంగానే పెరిగింది కానీ కోరికలేమీ తీరేవికాదు.

తండ్రి తనకు వచ్చే జీతంలో ఒబ్బిడిగా గడుపుకుంటూ తన కోరికలన్నీ త్యాగం చేసి పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలనుకున్నాడు. ఆ ప్రయత్నంలోనే ముక్తకు గౌతమ్ వంటి వరుణ్ణిచ్చి చేశాడు.

గౌతమ్ ఉద్యోగం ప్రైవేట్ కంపెనీలో. ఎమ్మే ప్యాసయ్యాడు. నెలకు పదిహేను

వందలు జీతమంటే చాలా ఎక్కువనే అనుకుందామె.

వేరు కాపురం ప్రారంభించాక కానీ అసలు విషయం తెలియలేదు.

ముక్త కలలు కనే లాంటిల్లు కావాలంటే అద్దె కనీసం వెయ్యి రూపాయలవుతుంది. మూడు వందల యాభై రూపాయలిచ్చి ఓ రెండు గదులింట్లో ఉంటున్నారు. అందులోనే అదృష్టం - ఇంటికి కాస్త పెరడుండడం!

గౌతమ్ కింటి బాధ్యతలున్నాయి. నెలనెలా అతడు తల్లి దండ్రులకు రెండు వందల రూపాయలు పంపిస్తూంటాడు. పెళ్ళికి ముందు అతడు తన గురించంటూ ఏమీ నిలవేసుకోకుండా - మిగిలిందంతా తలిదండ్రులకే పంపేవాడు.

ఒక్కసారిగా పదివేలు ఖర్చు పెట్టలేక గౌతమ్ స్కూటర్ కొనడంలేదు. అతడాఫీసుకు బస్సులో వెడతాడు.

ముక్తకు గట్టిగా తనకు నచ్చిన చీర కొందామంటే లేదు.మంచి చీరలేవీ రెండొందల యాభైకి తక్కువలో లేవు.

"నెల ఖర్చుల్లో జాగ్రత్తగా ఉంటే, ఆర్నెల్లకొకసారి దర్జాగా ఉండొచ్చు", అనిగౌతమ్ అంటాడు.

బయటకు వెళ్ళినప్పుడల్లా దర్జాగా ఉండాలని ముక్త కోరిక.

బైటకు వెడితే ఆటోలో వెళ్ళాలి. బైట కూర్చుంటే ఐస్క్రీమ్‌లు తినాలి.

అందుకే దంపతులిద్దరూ కలసి బైటకు వెళ్ళడం తగ్గించేశారు.

ఇంట్లోనే ఒకరి నొకరు చూసుకుంటూ, ఒకరితో ఒకరు కబుర్లు చెప్పుకుంటూ గంటలు క్షణాల్లా దొర్లించేయగలమని గౌతమ్ అంటాడు.

ముక్త మనసు కది సరిపడలేదు.

ఆమెకు బయట ప్రపంచంలో తిరగాలని ఉంది. తానందరికీ కనబడాలి. తను రాకుమారిలా, తన పక్కన భర్త రాకుమారుడిలా -.... ఇద్దరూ విహరిస్తూంటే లోకమంతా కళ్ళప్పగించి తమవంకే చూడాలన్నదామె కోరిక ...

భర్త తనను ప్రేమించడంలో ఆమె కానందం లేదు. భర్త తన కిచ్చే హోదాను ప్రదర్శించడంలోనే ఉందామె సంతోషం.

"మీ అంతస్థు, హోదా పెరగాలి ... అందుకోసం మీరేం చేసినా నా కభ్యంతరం లేదు -" అనితరచుగా ఆమె భర్తతో అంటూండేది.

భార్యంటే ఎంతో యిష్టపడే గౌతమ్ కామె కోరిక మన్నించి తన హోదాను పెంచుకోవాలనే ఉంది. కానీ అతని పరిమితులతడికున్నాయి. ఆ విషయం భార్య ముందొప్పుకోవడమిష్టంలేక - ప్రేమ గొప్పతనాన్ని పొగుడుతూండేవాడు. జీవితంలో ప్రేమను మించినదేదీలేదనీ, ఏ దారి తొక్కినా డబ్బు సంపాదించవచ్చుననీ - ప్రేమ అలా దొరికేది కాదనీ భార్యతో అంటూండేవాడు. ముక్త ప్రేమ తనకు లభించడం వల్ల ఇతర భోగభాగ్యాల మీద మనసు లేదన్నాడు. భార్య కూడా అలాగే అంటుందని ఆశించాడు.



కానీ ముక్త అతడేదారైనా సరే తొక్కి - డబ్బు సంపాదిస్తే -అప్పుడే అతణ్ణి నిజంగా ప్రేమించేలాగుంది.

ఈ విషయం చూచాయగా పెళ్ళైన ఆర్నెల్లల్లోనే గ్రహించాడు గౌతమ్. అతడది గ్రహించాక మరో ఏడాది గడిచింది.

సరిగ్గా నిన్నటి రోజున గౌతమ్‌కి విషయం మరింత ఎక్కువగా గ్రహించాల్సిన అవసర మేర్పడింది.

గౌతమ్ బాస్ పేరు భానుప్రకాష్.

అతడికి బాగా డబ్బున్నప్పటికీ సింపుల్‌గా ఉంటాడు. తన క్రింది వారందరితోనూ అరమరికలు లేకుండా మాట్లాడుతాడు. కంపెనీ యాజమాన్యంలో అతడికి చాలా మంచి పేరుంది.

భానుప్రకాషింట్లో పేరంటం.

పేరంటానికి పిలుపు భానుప్రకాష్ ద్వారా అందింది గౌతమ్‌కు.

భానుప్రకాష్ భార్య సంధ్యకు రెండ్రోజుల నుండి జ్వరం.ఆ కారణంగా అందరిళ్ళకూ స్వయంగా వెళ్ళి పిలవడంలేదు. చాలా మందిని ఫోను ద్వారా పిలిచింది. కొందరికి కార్లో మనిషి ద్వారా కబురంపింది. ఆఫీస్ స్టాఫ్‌కు భానుప్రకాష్‌ని చెప్పమంది.

పేరంటం గురించి గౌతమ్ భార్యకు చెప్పాడు.

అతడు భానుప్రకాష్ వైభవాన్ని వర్ణించి- "అక్కడ నీకు గొప్పగొప్ప వాళ్ళ పరిచయాలవుతాయి -" అన్నాడు.

ముక్తకా సరదా ఉన్నట్లు లేదు. ఆమె తను వెళ్ళనంది.

"నాకో మంచి చీరలేదు.- పార్టీకెలా వెళ్ళను ?"అందామె.

ముక్తకు పెళ్ళినాటి పట్టు చీరలు రెండున్నాయి. కానీ ముక్తకు పట్టుచీర కట్టుకోవడం ఇష్టం లేదు.

"వెళ్ళేది పేరంటానికైనా - పట్టుచీర నా వయసుకు తగ్గది కాదు. మంచి గార్డెన్ చీరైతే బాగుంటుంది-" అంది ముక్త.

రెండు నెలల క్రితం గౌతమ్ ఆమెకో గార్డెన్ చీర కొన్నాడు. ఖరీదు రెండు వందల ఎనభై రూపాయలు.

"గొప్ప వాళ్ళింటికి పేరంటానికి వెడుతూ నగ లేసుకోకుండా ఎలా? పెళ్ళికి మా నాన్న చేయించిన నీలపురాళ్ళ నెక్లెస్ వేసుకుంటాను. దానికి మ్యాచింగ్ ఉంగరం కూడా ఉంది. ఈ రెండూ ఉన్నదు వాటికి మ్యాచింగ్ చీర లేకపోతే ఏంబాగుంటుంది? అప్పుడు కొన్న గార్డెన్ చీర లేతపసుపు రంగుది...." అందిముక్త.

అంటే యిప్పుడు నీలంరంగులో గార్డెన్‌చీర కొనాలి. వెళ్ళేది గొప్పింటి పార్టీకి కాబట్టి చీరఖరీదు మూడొందల యాభైకి తగ్గకూడదు. పాతచీరతోనే సరిపెట్టుకోవాలంటే అందుకూ ఆమె సిద్ధమే! దానికి మ్యాచింగ్‌గా రాళ్ళనెక్లెస్, ఉంగరం

కావాలి. కాకిబంగారం ఆమెకు పడదు.

చీరరంగు నిర్ణయమైతే మ్యాచింగ్ జోళ్ళుకూడా కొనుక్కోవాలనుకొంటోందామె.

గౌతమ్ అప్పుడు తనకొచ్చిన యిబ్బందులన్నీ ఆమెకేకరువుపెట్టుకుని – "నీ కోసం కొండమీద కోతిని దింపాలనుంటుందినాకు. నీ అంత అందమైన భార్యనిచ్చిన దేవుడు – నిన్ను సంతోషపెట్టే శక్తి నివ్వలేదు –" అని బాధపడ్డాడు.

ముక్త అతడి జుత్తులోకి వేళ్ళు పోనిచ్చి ఎంతో ప్రేమగా – "పోనీ లెద్దురూ– నాకు మీ ప్రేమాభిమానాలు చాలు. పేరంటానికి వెళ్ళకపోతేనేం?" అంది.

అది బాస్ ఇంటిపిలుపు. వెళ్ళకపోతే అయనక్కోపం వస్తుంది. ఆఫీసులో అయన తనపై కక్ష గట్టచ్చు.

"నాభార్య స్వయంగా పిలవలేదని నీభార్య రానంటుంది. ఆమెకు నిజంగా జ్వరం. నీభార్యనెలగో అలా ఒప్పించాలి –" అన్నాడు బాస్ ప్రతి ఉద్యోగితో.

ముక్త వెళ్ళకుంటే అది అసహాయతగాకాక అహంకారంగా భావించబడుతుంది గౌతమ్ భార్యకు తన యిబ్బంది చెప్పుకున్నాడు.

"మీరు మీ సంగతే చూసుకుంటున్నారు. నా సంగతి ఆలోచించరేం? ఆడాళ్ళ మధ్య ఎన్నో ఉంటాయి. సలుసురిలోను అవమానపడే కంటె పేరంటానికి వెళ్ళక పోవడమే మేలు......" అంది ముక్త.

చివరకు గౌతమ్ అప్పు చేయాలని నిర్ణయించుకున్నాడు. నెలాఖరు రోజుల్లో అయిష్టాకొందలంటే మాటలు కాదు. అతడు తన ప్రయత్నం తను చేస్తున్నాడు.

ఆ రోజాఫీసునుంచి పెందరాళే యింటికొచ్చేస్తాననీ – ఇద్దరం కలసి షాపింగుకు వెడదామనీ భర్త ఆమెకి చెప్పాడు.

పెందరాళే అన్నవాడు అసలు టైము దాటినా యింటికి రాలేదు.

టైము ఎనిమిదయింది. అయినా అతడింకా రాలేదు.

ముక్త అసహనంగా పచార్లు చేస్తోంది పెరట్లో!

పేరంటం పంక పెట్టి గార్డెన్ చీర కొనుక్కోవాలనుందామెకు. కానీ ఏదైనా కుంటిసాకు చెబుతాడేమోనని ఆమె భయం.

గుమ్మంలో ఎదురు చూసి చూసి – చివరకు పెరట్లోకి వచ్చింది.

ఆకాశంలో వెలిగి పోతున్న చంద్రుడుకానీ, అతడు కురిపిస్తున్న వెన్నెలకానీ ఆమెకు సంతోషాన్నివ్వడంలేదు.

తలుపు తట్టిన శబ్దం కోసం ఎదురు చూస్తోంది.

చివరికాశబ్దమామెకు వినిపించింది.

ఒక్క పరుగున యింట్లోకి వెళ్ళి వీధి తలుపు తీసింది.

గుమ్మంలో గౌతమ్!

"ఇంత ఆలస్యమయిందేం?" అంది ముక్త.

"ఆలస్యమయితేనేం డబ్బు దొరికింది. ఎలుండి కదా! రేపు సాయంత్రం



మనం షాపింగుకి వెడదాం –" అన్నాకనే గౌతమ్ లోపల ప్రవేశించాడు.

భానుతేజంలో వెన్నెలలు కురిపిస్తూ – ఎందరికో కవితా వస్తువైన పున్నమి చంద్రుణ్ణి మించి – గౌతమ్ ముఖం వెలిగి పోతోంది.

ఆ వెన్నెలలు ముక్త కానందాన్ని కలిగిస్తున్నాయి.

## 2

ఆటో ఆ బంగళా ముందాగింది.

ముక్త ఆటో వాళ్ళాకు డబ్బిచ్చి క్రిందకి దిగింది.

ఎదురుగా చిన్న గేటు ...

ముక్త గేటు తీసుకుని లోపలకు వెళ్ళింది ...

ఇంటి చుట్టూ పూలతోట.

తోటలో రకరకాల పూలు ... అందమైన పూలు ....

ఆ పూలన్నీ ముక్తను పలకరిస్తున్నాయి.

ముక్త వాటి అందాన్ని చూడ్డం లేదు. పలకరింపుని వినడం లేదు.

ఆ పూలతోట యజమానురాలిని తల్చుకుని అసూయ పడుతోంది.

ఆ అసూయతోనే ఆమె ఆ యింట్లో ప్రవేశించింది.

ముందుగా నేడుందో పెద్ద హాలు ....

ఆహాల్లోనే పేరంటాళ్ళున్నారు ...

ముక్త గుమ్మంలో అడుగు పెట్టగానే చాలామంది కళ్ళటు తిరిగాయి.

ఆ యింటిని దూరాన్నుంచి చాలాసార్లు చూసింది ముక్త లోపలకు వెళ్ళడం అదే మొదలు.

ఒక సన్నని పొడవాటి స్త్రీ ఆమెను సమీపించింది.

అమె మరీ అంత అందగత్తె కాకపోయినా హుందాగా ఉంది. ఛాయ మాత్రం బంగారంలా మెరిసి పోతోంది.

ఆమె కనులలో కనిపించీ కనిపించని విషాదం.

అది కూడా ఆమె కందాన్నే యిచ్చింది.

"నేను మిసెస్ భాను ప్రకాష్. అందే సంధ్య మీరు మిసెస్ గౌతమ్ కదూ – మీ పేరు?" అందామె.

"ముక్త –"

"మీ అందానికి తగ్గపేరు –" అందామె.

తను మిసెస్ గౌతమ్ అని ఆమెకెలా తెలిసిందా అని ఆలోచిస్తూ లోపల అడుగు పెట్టింది ముక్త.

దూరంగా నిర్మల కన బడింది.

నిర్మల సదానందం భార్య. సదానందం గౌతమ్కు సీనియర్ కొలీగ్. వారంద రికీ చాల కాలం నుంచీ పరిచయముంది.

"నేను ఫలానా అని నిర్మల చెప్పి ఉంటుంది -" అనుకుంది ముక్త.
అయితే నిర్మల ముక్తను పలకరించలేదు. ఆమె వంక చూడలేదు. అక్కడ పెత్తనం చెలాయిస్తూ హడావిడి పడి పోతోంది. తనకు లభించిన కొత్త పదవిని నిర్వహించటంలో ఉన్న ఆనందం - ఎరిగున్న వారిని పలకరించడంలో ఆమెకున్నట్టు లేదు.

సంధ్య ఆమెను కాస్త లోపలకూ తీసుకెళ్ళి ఓ కుర్చీలో కూర్చోమని చూపించింది.

ముక్త కుర్చీలో కూర్చుంది.

కొత్త మోడల్ ఫైబర్ గ్లాసు కుర్చీ అది.

రంగు రంగుల చీరల్లో ఆడవాళ్ళున్నట్టే - ఆ కుర్చీలు కూడా వివిధ రంగుల్లో ఉన్నాయి.

కుర్చీలో కూర్చుంటే మెత్తగా సోఫాలో కూర్చున్నట్లుంది.

"చాలాఉన్నాయి. కొన్నారో - అద్దెకు తెచ్చారో -" అనుకుంది ముక్త.

సంధ్య అక్కణ్ణించి వెళ్ళి పోయింది.

ముక్తకు పక్కనే కూర్చున్న ఒకామె ఆమెను పలకరించి - "మిమ్మల్నెప్పుడూ చూడలేదు -" అంది.

"నేనూ అంతే !" అంది ముక్త.

పక్కనున్నావిడ దెబ్బతిని - "నా పేరు సరళ. మావారు రావ్ ఆండ్ రావ్ కంపెనీలో మానేజింగ్ డైరెక్టరు" అంది.

ముక్త ఏదో అనే లోగనే ఆమె తన భర్త గురించి చాలా వివరాలు చెప్పుకుని ముక్త సరేంచేమీ అడగ లేదని గుర్తించిందో ఏమో - "మీ వారేం చేస్తున్నారు ?" అనడిగింది.

తటపటాయిస్తూనే చెప్పింది ముక్త.

"ఓహో -" అంది సరళ. తర్వాతామె తన కటు పక్కనున్న మరో స్త్రీతో కబుర్లు ప్రారంభించింది.

తన హోదా తెలియగానే సరళకు తనపై ఆసక్తి నశించిందని గ్రహించిన ముక్తకు మనసు చివుక్కుమంది.

అప్పుడామె అక్కడున్న వారొక్కరినే పరిశీలిస్తోంది.

ప్రతివారి ముఖంలోనూ దబ్బుకళ స్పష్టంగా కనబడుతోంది. కానీ వారందరిలోకీ తనే అందంగా ఉంది. ఇంకా చెప్పాలంటే తను హీరోయిన్లా ఉంది.

అక్కడ చాలా మంది స్త్రీలు గుంపులు గుంపులుగా చేరి మాట్లాడుకుంటున్నారు. ముక్తకు తోడెవ్వరూ లేరు

ఎవరైనా కొత్తవారు రాగానే చాలామంది ఆమె చుట్టుచేరుతున్నారు.

సరళ తన హోదా గురించి చెప్పేసిందేమో - ఎవరు తన పక్కకు రావడం



లేదని ముక్త అనుకుంది.

ఆసమయంలో అక్కడకో యువతి ప్రవేశించింది,

ఆమెకు సుమారు ముప్పై ఏళ్ళుంటాయి.

సుమారైన అందగత్తె ఆమె. మనిషి హుందాగా, గంభీరంగా ఉంది.

ఆమెలోపలకు రాగానే సంధ్య ఆమెను రిసీవ్ చేసుకుందుకు వెళ్ళింది. - "రా పావనీ !" అందామె,

ఆమాటలు హాల్లో అందరికీ వినిపించాయి.

సంధ్య పావనిని హాల్లో కుర్చీలో కూర్చోపెట్టకుండా లోపల గదిలోకి తీసుకొని వెళ్ళింది.

హాల్లో ఒక్కసారి నిశ్శబ్దం.

ముక్త ఆశ్చర్య పడింది.

ఎవరీ పావని ? వస్తూనే ఇక్కడింత నిశ్శబ్దాన్నెలాసృష్టించగలిగింది ? సంధ్య ఆమెను ప్రత్యేకంగా లోపలకెందుకు తీసుకెళ్ళింది ?

పక్కనున్న సరళ మరో ఆమెతో అంటోంది - "పావనిట...పావని ! కనీసం పేరు మార్చుకోవాలనైనా తోచలేదు......"

"బాగ చెప్పారు. మనమైతే జరిగిందానికేనుయ్యో గుయ్యో చూసుకునే వాళ్ళం..." అంది సరళ పక్కనున్నామె.

ముక్త కుతూహలం చంపుకోలేక - "ఎవరండీ ఆపావని ?" అని సరళ నడిగింది.

ఆ ప్రశ్నకు సరళ ముందుగా చలించలేదు. అయితే తనకోగొప్ప అవకాశం పోసున్నదని వెంటనే ఆమె గ్రహించి ఉండాలి ... ముక్తవైపు తిరిగింది.

స్నేహభావంతో పలకరించడానికి మనిష తనచుట్టూ ఎన్నైనా అడ్డుగోడలు నిర్మించుకుంటాడు. కానీ సాటి మనిషిని కించపర్చడానికదే మనిషి ఎన్ని మెట్లయినా దిగిరావడానికి సంకోచించడు.

సరళ నోట ముక్త పావని కథ వింది.

పావనికో ప్రియుడున్నాడు. పెళ్ళికి ముందే వాళ్ళిద్దరికీ సంబంధమేర్పడింది. ప్రియుడామెను మోసం చేశాడు. పావని అబార్షన్ చేయించుకుంది. అబార్షన్ చేసిన డాక్టరే ఆమె అంటే యిష్టపడి పెళ్ళి చేసుకున్నాడు. అలా కొన్నేళ్ళు గడిచాయి. ఎక్కడికో పోయిన పావని ప్రియుడూరికి తిరిగొచ్చాడు. పావనిని బ్లాక్‌మెయిల్ చేయాలనుకున్నాడు. ఫలించలేదు. పావని కథ భర్తకు తెలుసునని తెలిశాక - అతడామెను రేప్ చేశాడు. పావని పోలీసు రిపోర్టిచ్చింది. పావని ప్రియుడికి యావజ్జీవ కారాగారశిక్ష పడింది.

జరిగిందానికి పావని సిగ్గుపడలేదు. పైగా ధైర్యంగా తలెత్తుకుని తిరుగుతోంది. పావని భర్తకామెఅంటే ప్రాణం. అతడు బహుశా నపుంసకుడై ఉండాలి.

లేకుంటే చెడిన ఆడదాన్నెందుకు పెళ్ళి చేసుకుంటాడు? ఆ తర్వాత ఆమె అత్యాచారానికి గురైతే ఎందుకు మన్నిస్తాడు?

"అనాదిగా మగాడి వంచనకు, అత్యాచారానికి గురవుతోంది ఆడది. నా ధైర్యం, నా భర్త, సహనం - ఆ వంచకుల కెదురుదెబ్బ! మహిళామణులకు కొత్త ఊపిరి -" అంటుంది పావని.

పావని భర్త హస్తవాసి మంచిది. కాబట్టి సమాజంలో ఆయన్నెవరూ చిన్న చూపు చూడ్డంలేదు. కానీ - సంప్రదాయానికి విలువనిచ్చే సమాజంలో పావని పతిత గానే గుర్తించబడుతోంది. ఎందరో ఆమెను వెలివేశారు.

ఎక్కువ పార్టీలకు పావని రాదు. సాటివారు వేసే ప్రశ్నలనామె భరించలేదు. ప్రశ్నలు వేయనిచోట వారి చూపులనుకూడా ఆమె భరించలేదు.

"నేనేమీ తప్పు చేయలేదు. ఓ పురుషుణ్ణి నమ్మి ప్రేమించి నా తనువు నర్పించాను. అతడు నన్ను మోసం చేశాడు. తర్వాత నాకు పెళ్ళయింది. నిండు మనసుతో నా భర్తను ప్రేమించాను. నన్ను మోసగించినవాడు నాపై అత్యాచారం చేశాడు. అందులో నా తప్పేముంది? నా దురదృష్టం. వాడు మళ్ళీ మరొకరిపై అత్యాచారం చేయకూడదని పోలీసులకప్పగించాను. సమాజం నా ధైర్యాన్నభినందించాలి -" అంటుందామె.

ఆమె ధైర్యం సాటి ఆడవారిలో ఆమెకు సానుభూతి లేకుండా చేసింది.

ఎవరి విషయమెలాగున్నా - సంధ్య పావనిని ప్రతి పేరంటానికీ, పార్టీకీ పిల్చి తీరుతుంది.

పార్టీలో యితరు లెవ్వరికీ పావనిరాక గిట్టదని ఆమెకు తెలుసు. అందుకే ఆమెను ప్రత్యేకంగా లోనికి పిలిచి వాయనాలిచ్చి ముందుగా పంపేస్తుంది. ఆమె వెళ్ళిపోయాకనే అసలు ఫంక్షన్ ప్రారంభమవుతుంది.

పావనికి సిగ్గులేదు. తన్నుచూసి నవ్వుకుంటారని తెలిసికూడా పిల్చిన ప్రతి చోటకూ వెడుతుంది.

పావనికి అహంకారం. నలుగుర్ని పిలిచి పలకరించి స్నేహం పెంచుకోవాలని చూడదు. తనతో స్నేహం కోరేవారు తననే పలకరించాలంటుంది.

సంధ్యకు పావనితో స్నేహమెందుకో తెలియదు.

పావని భర్త సంధ్యకు ఫామిలీ డాక్టరుకూడా కాదు.

సరళ అభిప్రాయంలో సంధ్య అమాయకురాలు. మాయ, మర్మం తెలియని మనిషి. పావనికెక్కడా స్నేహితురాండ్రు లేరు. సంధ్యనామె బుట్టలో వేసుకుని స్నేహితురాలిని చేసుకుంది.

పావని గురించింకా రకరకాలుగా చెప్పాలనుకుంది సరళ. కాని యింతలోనే వాయనం తీసుకుని వెళ్ళిపోతోందామె.

ఆమె వెళ్ళిపోయేదాకా హాల్లో నిశ్శబ్దం.



పావని నిష్క్రమించాకనే అక్కడ కార్యక్రమం ప్రారంభమయింది. కార్యక్రమం నడుస్తూండగా ఎందుకో భానుప్రకాష్ వచ్చాడు.

సంధ్య అతడికెదురై - "ఈ సమయంలో వచ్చారేమిటి?" అంది.

అతడు నవ్వాడు.

అతడి రూపం అతడి హోదాకు తగ్గట్టే వుంది.

ఎందరో కన్నెపిల్లలు కలలుగనే సినీ హీరోలా ఉన్నాడతడు.

అతడి నవ్వుమాత్రం సినీ హీరోల నవ్వుకంటె మనోహరంగా ఉంది.

"ఉండండి. వీరందర్నీ మీకు పరిచయం చేస్తాను-" అంది సంధ్య.

ఆమె ఒక్కొక్కరినే పేరు పేరునా భర్తకు పరిచయం చేసింది. వారిలో చాలామంది భానుప్రకాష్‌కు తెలుసు. తనకు తెలియని వారివంక అతడు కుతూహలంగా చూస్తున్నాడు.

తనను పరిచయంగానే - "నమస్తే!" అన్నాడతడు.

"నమస్తే!" అంది ముక్త.

క్షణకాలం ఇద్దరి చూపులూ కలిశాయి.

అతడి చూపుల్లో అయస్కాంతంవంటి ఆకర్షణ చూసింది ముక్త.

భానుప్రకాష్ లోపలకు వెళ్ళిపోయాడు.

"పావని అయితే - నమస్తే చెప్పి ఊరుకోదు. షేక్‌హ్యాండిస్తుంది..." అంది సరళ.

నలుగురైదుగురు నవ్వారు.

"మన సంప్రదాయమంతా ఆడదాని పవిత్రతలో ఉంది. అది నిలుపుకోనినాడు మనం మనంకాదు -" అందింకొకామె.

ముక్తకూడా ఆ సంభాషణలో ఆసక్తిగా పాల్గొంది.

డబ్బున్నవారికి లేనివారు చులకన. అధికారమున్న వారికి లేనివారు చులకన. నీతిపరులకు అవినీతి పరులు చులకన. కానీ ...

లేనివాళ్ళ శ్రమతో ఉన్నవాడి దగ్గర డబ్బు చేరుతోంది. ఊరూ పేరూలేని సామాన్యుడు ఓటు - మరో సామాన్యుడి నధికారిగా మార్చుతోంది. ఫలితంగా అవినీతి పరులు నీతిపరులను శాసిస్తున్నారన్న విషయం తెలిసికూడా గ్రహించరెవ్వరూ ...

మనను పాలించే వాడిలో అవినీతి ఉంది. మనకు పాఠం చెప్పేవాడిలో అవినీతి ఉంది. మనం బ్రతికే బ్రతుకులో క్షణం క్షణం అవినీతి ఉంది.

కానీ ప్రతివాడూ తను నీతిపరుణ్ణనే అనుకుంటాడు.

ముక్త ఈ ఫక్కీలో ఆలోచించడం లేదు.

ఆమె పావని గురించి ఏహ్య భావాన్ని పెంచుకుంటోంది.

ఎంత నమ్మితేమాత్రం - పెళ్ళికి ముందే పరాయి మగాడితో ఎందుకు సంబంధం పెట్టుకోవాలి? అందులో ఆమె మానసిక బలహీనత ఉంది. ఆ బలహీ

నతనే సమాజం తప్పు పడుతోంది.

ఒకసారి మోసగించిన ప్రియుడు - తిరిగి ఆమెను బలాత్కరించగల ఏకాంతాన్నెలా పొందాడు? ఆమెకతడికలాంటి అవకాశమెలా యిచ్చింది?

పావనిలో ఏదో బలహీనత ఉంది.

పాత ప్రియుడినామె మరచి పోలేకపోతోంది.

లేక నలుగురూ అనుకుంటున్నట్టామె భర్త నపుంసకుడే కావచ్చు.

తన కోర్కెలను చంపుకోలేక, మనసు నదుపులో పెట్టుకోలేక - ఆమె పాత ప్రియుడితో తిరిగి సంబంధం పెట్టుకుని - పట్టుబడితే దాన్ని బలవంతంగా మార్చి ఉంటుంది.

ఛీ ... ఎలాంటి ఆడది?

క్రమంగా పేరంటం కార్యక్రమం ముగిసింది.

వచ్చిన వారిలో చాలామందిని వెనక్కు తీసుకుని వెళ్ళడానికి కార్లు వచ్చాయి.

తనూ లేచింది ముక్త.

"మొదటిసారి వచ్చారు. కాసేపు కూర్చోండి -" అంది సంధ్య.

ముక్త ఆమె బలవంతం చేయగా కాదనలేక పోయింది.

అంతా వెళ్ళిపోయాక సంధ్య, ముక్త మిగిలారు.

అప్పుడు సంధ్య ముక్తను ఆమె గురించిన వ్యక్తిగత వివరాలడిగింది.

మొదట్లో తటపటాయించినా క్రమంగా సంధ్యతో మంచి స్నేహితురాలిగా భావించి - ఒక్కొక్కటిగా కుటుంబ విశేషాలు చెప్పిందామెకు ముక్త.

తన కుటుంబం గురించి చెబుతున్నప్పుడు ముక్త కళ్ళలో కనబడ్డ మెరుపును చూసింది సంధ్య.

"మధ్యతరగతి కుటుంబాల్లో ఆర్థిక సమస్యలున్నప్పటికీ అభిమానాలూ, ఆత్మీయతా వాటిని కమ్మేస్తాయి-" అంది సంధ్య.

"అవును - అమ్మన్నా, నాన్నన్నా, అన్నయ్యలన్నా నాకెంతో యిష్టం" అంది ముక్త.

"నాకూ అంతే! నేనూ మధ్యతరగతి నుంచే వచ్చాను. మావారుకూడా మధ్యతరగతిలోనే పుట్టి పెరిగారు. ఇప్పుడైశ్వర్యం పేరుకున్నప్పటికీ మేము వీలైనంత సింపుల్‌గా ఉంటాం. మా కిద్దరు పిల్లలు. ఇద్దరూ స్కూలుకు వెడుతున్నారు. వాళ్ళనికూడా మధ్యతరగతి వాతావరణంలోనే పెంచాలన్నది మా కోరిక. అందుకే తరచు మేము బంధువులిళ్ళకు వెడుతూంటాం. స్నేహం కూడా ఎక్కువగా మధ్యతరగతి వారితోనే......" అంది సంధ్య.

ఆమె మాటిమాటికీ మధ్య తరగతి అంటూంటే ముక్తకది తననే ఉద్దేశించి అన్నట్టనిపిస్తోంది. సంధ్య తనకంటే చాలా ఎత్తులో ఉన్నదనిపిస్తోంది. ఈ తరహా సంభాషణ ఆమెకు నచ్చలేదు.



మాట మార్చడంకోసం ఆమె పావని ప్రసక్తి తెచ్చింది.

సంధ్య ముఖం పాలిపోయింది.

"పావని గురించి మీకెవరు చెప్పారు?" అందామె.

"ఇక్కడ చేరిన వాళ్ళంతా ఆమె గురించే మాట్లాడుకున్నారు. మీరు మంచివారు కాబట్టికానీ ఆమె వంటివారితో స్నేహం చేయరన్నారు..."

"పావని చేసిన తప్పేమిటో వాళ్ళు మీకు చెప్పారా?"

ముక్త పావని గురించి తను విన్నదామెకు చెప్పి - "ఇది నిజమేనా?" అంది.

"నిజమే - కానీ మీకందులో తప్పు కనబడుతోందా?"

"ఊఁ" అంది ముక్త ఆలోచించకుండా.

"వెంటనే ఊఁ అనడం కాదు. కాసేపాలోచించి చెప్పండి -"

"ఇందులో ఆలోచించడానికేముంది? బలహీనతను జయించడంలోనే సంస్కారముంది..."

"సంస్కారం బలహీనతను జయించడంలోకాదు. మన్నించడంలో ఉంది." అని - "పావని పరిస్థితులు మీకే ఏర్పడితే ఏం చేసేవారు?" అంది సంధ్య.

"ఆ పరిస్థితుల నామె ఆహ్వానించింది. పెళ్ళయ్యే వరకూ నాకు పరాయి మగాళ్ళతో పరిచయమే లేదు ...."

"పోనీ - ఇంట్లో ఏ బావో ఉంటే ....?"

ముక్తకు తన బావ గుర్తుకొచ్చాడు. అతడు తన కంటే రెండేళ్ళు పెద్ద. ఒకటి రెండు సార్లతడు తనకు దగ్గరగా రావడానికి ప్రయత్నించాడు. ఆమె సాగనివ్వలేదు.

"ఎవరైనా మనమిస్తేనే అవకాశం ...." అంది ముక్త నమ్మకంగా....

సంధ్య తనూ నవ్వేసి - "మీవి కచ్చితమైన అభిప్రాయాలు. ఇలాంటి వారితో మాట్లాడ్డం మా వారికి చాలా యిష్టం. కాసేపుండకూడదూ?" అంది.

ముక్త తడబడుతూ - "నేను వారితో ఏం మాట్లాడగలను?" అంది.

"ఈ మాట వారితో మాట్లాడేక అందురుగాని ..." అంది సంధ్య,

ఇద్దరూ ఓ గదిలోకి వెళ్ళారు.

గదిలో నాలుగు సోఫాలు, రెండద్దాల బీరువాలు ఉన్నాయి.

ఒక సోఫాలో కూర్చుని భానుప్రకాష్ చదువుకుంటున్నాడు.

"మావారి రీడింగ్ రూమిది!" అని అంది సంధ్య.

భానుప్రకాష్ పుస్తకంలోంచి తలెత్తి వారివంక చూసి చటుక్కున లేచి నిలబడి ప్రశ్నార్థకంగా భార్యవంక చూశాడు.

"మిసెస్ గౌతమ్ - పేరు ముక్త - అభిరుచుల్లో మీవంటిదే ఈమె. మనకు మంచి స్నేహితురాలు -...." అంది సంధ్య.

ఇద్దరూ అతడి కెదురుగా కూర్చున్నారు.

కబుర్లు మొదలయ్యాయి.

"ఆఫీసుకు నేనే బాస్ని కావడం వల్ల నా యిష్టం వచ్చిం వచ్చినప్పుడల్లా యింటికి వచ్చేస్తూంటాను. అయితే అందరికంటే నేనే ఎక్కువసేపు పనిచేస్తాను. రాత్రింబవళ్ళు తేడా లేకుండా పని చేస్తాను ..." అన్నాడు ముందుగా భానుప్రకాష్.

ఆ సమయంలో యింట్లో ఉండడానికతడు సంజాయిష్ యిస్తున్నట్లు తోచింది ముక్తకు.

"ఒక సారింటికి వచ్చేక మళ్ళీ ఆఫీసుకు వెళ్ళ బుద్దేస్తుందా?" అంది ముక్త.

"ఏముంది? ఏ మీవంటి వారినో పలకరించడమవుతుంది. ఆ ఇన్స్పిరేషన్తో మరింత ఉత్సాహంగా పని చేయగల్గుతాను ...." అన్నాడు భానుప్రకాష్,

ముక్త ఇబ్బందిగా నవ్వింది.

సంధ్య వెంటనే - "అయితే మీ స్టాఫ్ను కూడా ఓ వేళాపాళా లేకుండా ఇంటికి పంపేస్తూండండి - బాగా పని చేస్తారు -" అంది.

"నువ్వు చెప్పిందాలోచించవలసిందే ..." అంటూ భానుప్రకాష్ ఆలోచన నభినయించ సాగాడు.

"మీ రాలోచిస్తూండండి. నేనిప్పుడే వస్తాను ...." అంటూ సంధ్య అక్కణ్ణించి లేచి వెళ్ళి పోయింది.

ముక్త తనూ లేవాలనుకుంది కానీ సంధ్య చాలా త్వరగా వెళ్ళిపోయింది. ముక్త లేచేలోగా భానుప్రకాష్ ఆమెతో - "మిగతా స్టాఫ్ విషయమెలాగున్నా మీ వారిని ఆఫీసు మధ్యలో ఇంటికి పంపలేను. మాకు మీరు ఇన్స్పిరేషన్ కావచ్చు. కానీ మీవారికి ఎట్రాక్షన్ ... అంతే అయస్కాంతం. ఒకసారింటికి వెడితే ఇకరాడు రాలేదు ..." అన్నాడు,

ముక్త కేమనాలో తోచక ఇబ్బందిగా నవ్వింది.

"మిసెస్ ముక్తా! మీ ముఖంలో సంస్కారంతో పాటు - ఒక విధమైన గ్రేస్ ఉంది. ఏ దేశానికో మహారాణి కావలసిన సౌందర్యం మీది. కాకపోవడం మీ అదృష్టం. ఎందుకంటే మహారాణికి భర్త సాన్నిధ్యం లభించదు ..." అన్నాడు భానుప్రకాష్.

తను మాట్లాడక పోతే బాగుండదని - "మీ యిల్లు చాలా అందంగా తీర్చి దిద్దారు. సంధ్యగారి అభిరుచి గొప్పది -" అంది.

"అభిరుచి సంధ్యది కాదు - నాది!" అన్నాడు భానుప్రష్.

అతడ లాగనడం మోటుగా అనిపించింది ముక్తకు. భార్య గురించి తనన్న ఒకే ఒక్క మంచి ముక్క నతడామోదించక పోవడం సంస్కారం కాదని పించిందామెకు.

భానుప్రకాష్ మళ్ళీ తనే - "నేను సంధ్యను చిన్నబుచ్చాలనిలాగనలేదు. నిజం చెప్పడానికి నేను సంకోచించను. సంధ్య కూడా నా నిజాలంటే ఇష్టపడుతుంది. ఉదా



హరణకు మీరు వెళ్ళాక సంధ్యతో చెబుతాను - ఐశ్వర్యమున్న వాకంటే - మీరున్న గౌతమ్ అదృష్టవంతుడని! ఆమె ఏమీ అనుకోదు ..." అన్నాడు.

మొదటిసారిగా ముక్తకు చిరాకు కలిగింది. ఆ చిరాకు ముఖంలో వ్యక్తం చేసిందామె.

భానుప్రకాష్ అది గమనించిన వాడిలా - "ఒక విధంగా నేనదృష్టవంతుణ్ణి. నాకు తోచింది నేను ధైర్యంగా మాట్లాడ గలను. ఎదుటి వాళ్ళకు నా మాటలు చిరాకు కలిగించినా వింటారు. ఎందుకంటే నేను వారికో, వారి భర్తలకో అధికారిని కనుక! ఎందరి భవిష్యత్తో నా చేతుల్లో వుంది కనుక!" అన్నాడు.

ముక్త కతడి మాటలో హెచ్చరిక కనబడింది. ఆహెచ్చరిక ఆమె చిరాకును భయంగా మార్చింది.

భానుప్రకాష్ ఆ భయాన్నికూడా చదివినట్లే ఉన్నాడు - "సినిమాల్లో అసభ్య దృశ్యాలు, సంభాషణలు ఉంటున్నాయి. వాటికారణంగా చిత్రం ఘనవిజయం సాధిస్తుందని నిర్మాతల అభిప్రాయం. పత్రికల్లో క్రమంగా అశ్లీలత చోటుచేసుకుంటోంది. పత్రిక సర్క్యులేషన్కదే కారణమని సంపాదకుల అభిప్రాయం. మనమంతా ఆ సినిమాలు చూస్తున్నాం. పత్రికలు చదువుతున్నాం. స్నేహితులతో చనువుగా మాట్లాడుకుందుకు భయపడుతున్నాం. హేమమాలిని బాగుంటుంది. శ్రీదేవి బాగుంటుంది. భానుప్రియ బాగుంటుంది. వాళ్ళు బాగున్నారని చెప్పుకుంటానికేమీ సందేహించని మనం - మనలో మనం బాగోగుల గురించి చెప్పుకుందుకెందుకు తటపటాయిస్తామో నాకు తెలియదు. అందంలో మీరు వాళ్ళను మించారు. సినిమాల్లో నటించని కారణంగా మీ అందం గురించి మాట్లాడ్డానికే భయపడాలా - నేను!"

అతడి వాదన చిత్రంగా అనిపించిందామెకు.

"ఏ మిథున్ చక్రవర్తో, గోవిందాయో బాగుంటాడని మీరు మీ భర్తకు చెప్పకుండా వుండగలరా? అది తప్పుగా మీ భర్త భావిస్తాడా? అలాంటప్పుడదే విధంగా నేను మీ గురించీ, మీరు నా గురించీ మాట్లాడుకోవడం తప్పవుతుందా?"

"ఇదంతా ఎందుకు చెబుతున్నారు?" అంది ముక్త.

"స్నేహానికి మొదటిమెట్టు చనువు. అర్థంలేని బహువచనాలతో ఒకరినొకరు దూరం చేసుకోకూడదు. నేను నిన్ను నువ్వంటాను. నువ్వూ నన్ను నువ్వను. ఆ విధంగా మనం స్నేహితుల మవుదాం. మన స్నేహం నా మానసిక వికాసానికీ, మీ ఆర్థిక వికాసానికీ మంచిది. నాతో స్నేహాన్నాశించే వారెందరో ఉన్నారు. కానీ నేను నాకు నచ్చిన వారితోనే స్నేహం చేస్తాను. నాకు నువ్వు నచ్చావు..." అన్నాడు భానుప్రకాష్.

ముక్తకేం చెప్పాలో తెలియలేదు. అతడి చనువామెకిచ్చిందిగానే పరిణమించింది.

భానుప్రకాష్ మళ్ళీ - "నువ్వు బహుశా నాసంస్కారం గురించి ఆలో

చిస్తూంటావు. నాసంస్కారం గొప్పని. ఆడవాళ్ళను స్నేహితులుగా చూడగలను. నా స్నేహితులగురించి నా భార్యతో మామూలుగా మాట్లాడగలను. అదేవిధంగా ఆమె స్నేహితుల గురించి వినగలను. నా సంస్కారం గురించి ఆలోచించేముందు- ఈ సంభాషణను నీ భర్తకు చెప్పుకోగలవేమో ఆలోచించు. అతడి సంస్కారం గురించి తెలుస్తుంది నీకు ....” అన్నాడు.

ముక్త కంతా అయోమయంగా అనిపించింది. భానుప్రకాష్ మనసులో ఏదో దురూహ ఉన్నట్లు లీలగా తోస్తోందామెకు.

“నేను మధ్యతరగతిలో పుట్టి పెరిగాను. మధ్యతరగతి గురించి నాకు క్షుణ్ణంగా తెలుసు. మధ్యతరగతి అంటే నా కెంతో యిష్టం. కానీ మధ్యతరగతిలో కొన్ని లోపాలున్నాయి, వారిలో ఫ్రాంక్‌నెస్ లేదు. నిజాయతీ లేదు. సాహసం లేదు. నేను జీవితంలో పైకిరావడానికి మధ్యతరగతి లోపాల్ని అధిగమించగలడమే కారణం. నువ్వూ అంతే! తలచుకుంటే కార్లలో తిరగ్గలవు. మేడల్లో మసలగలవు. ఫోన్లలో మాట్లాడగలవు. మధ్యతరగతి లోపాల్ని జయించాలి అంతే! నా స్నేహం నీ కందుకు సహకరిస్తుంది...”

ముక్త సహనానికి అంతరం వచ్చింది. ఆమె లేవాలనుకుంటూండాగా అక్కడికి వచ్చింది సంధ్య ఆమె. చేతిలో ట్రే ఉంది. ట్రేలో మూడుగ్లాసులు....

“ఆరంజి జ్యూసు...” అంది సంధ్య.

“చాలా ఆలస్యమయింది...” అంది ముక్త ఇబ్బందిగా.

“మావారు మిమ్మల్ని కార్లో డ్రాప్ చేస్తారు...” అంది సంధ్య.

“మిమ్మల్ని అనకు. ఆమె ఈ క్షణంనుంచీ మన స్నేహితురాలు...”

“అంటే?”

“చనువుగా నువ్వు అను...అక్కచెల్లెళ్ళలా మసలండి....”

“భలే వారే- నేను బైటకు వెళ్ళిన కాసేపట్లోనే ఏం మంత్రం వేశారండీ?” అంది సంధ్య ఆశ్చర్యం ప్రకటిస్తూ.

ముక్త ధైర్యం తెచ్చుకుని- “భార్య భర్తను ఏమండీ అంటే పోని చనువు- పరాయి వాళ్ళంటే పోతుందా?” అంది.

“భార్యా భర్తల అనుబంధం వేరు. మీకని మన్నించినా ఆమె ఏరా అనే తల్లికంటే భర్త దగ్గర చనువుగా ఉండగలదు, భార్యా చెల్లెలు మరదలు కూడా నన్ను నువ్వనే పిలుస్తుందని మర్చి పోకూడదు-” అన్నాడు భానుప్రకాష్.

“వారిని మాటల్లో జయించడం కష్టం-” అంది సంధ్య.

ముగ్గురూ జ్యూస్ తాగేరు -“నేనొక్కర్తినీ వెళ్ళగలను...” అంది ముక్త.

“వద్దు. నిన్ను నేనే ఉంచేశాను నిన్నింటిదగ్గర దింపడం నాదీ బాధ్యత...”

“ఎవరైనా చూస్తే బాగుండదు...” అంది ముక్త.

సంధ్య నవ్వి -“ఎందుకు బాగుండదు! కార్లో నేనూవస్తున్నాగా-” అంది.

“మీరూ వస్తున్నారా?” అంది ముక్త ఉత్సాహంగా. అంతలోనే -“అన



వసరంగా మీకెందుకుశ్రమ!” అంది మొహమాటానికి.

“శ్రమకాదు. ఇట్స్ ప్లెజర్...” అన్నాడు భానుప్రకాష్.

ముక్త ఉత్సాహంపై నీళ్ళు చల్లినట్లయింది. ఆమె సంధ్య వంక చూసింది. సంధ్య ముఖం గంభీరంగా ఉంది.

## 3

ఇల్లు చేరుకున్నాక ముక్త కేపనిమీదా ధ్యాస మళ్ళ లేదు.

భానుప్రకాష్ మాటలామె చెవిలో గింగురుమంటున్నాయి.

అతడి రూపం ఆమె కళ్ళ ముందు కదలాడుతోంది.

అతడి చూపులామెను వళ్ళంతా తడుముతున్నాయి.

“ఛీ - ఏం మనిషి?” అనుకుందామె.

ఐశ్వర్యంలో ఓ స్థాయి చేరుకుంటే మనిషి సంస్కారాన్ని కోల్పోతాడా! లేక సంస్కారాన్ని కోల్పోయే ధైర్యాన్ని ఐశ్వర్యం మనిషికిస్తుందా?

ఐశ్వర్యవంతులకు సంస్కారాన్ని కోల్పోవడమే సంస్కారమేమో!

భానుప్రకాష్ గురించి భార్య సంధ్యకు తెలుసా? ఆమె అతడి గురించేమనుకుంటోంది?

అసలు సంధ్యే తనను ప్రత్యేకంగా భర్తకు పరిచయం చేసింది. అదీకాక ఆఫీసు టైములో కూడా అతడింట్లోనే ఉన్నాడు. అంటే ముందుగానే అనుకుని ఇలా చేశారా? ఇలాచేయడం వల్ల సంధ్యకు ప్రయోజనమేమిటి? ఆమె భర్త విషయంలో అసహాయురాలా? అతడి ప్రవర్తన నదుపు చేయలేదు సరిగదా- అతడి చెడు నడతకామె సహకరించాలా? అదే నిజమైతే ఎంత దురదృష్టం?

“నీవంటి భార్య ఉంటే నేనూ యిల్లొదిలి పెట్టలేను. నావంటి వారికి ఇన్స్పిరేషన్... నీ భర్తకు ఎట్రాక్షన్...”

భానుప్రకాష్ సూటిగా చెప్పిన మాటలివి.

అతడికి భార్యంటే యిష్టంలేదా?

సంధ్యంటే అతడికెలాంటిష్టమో తెలియదు. కానీ తానంటే అతడికిష్టం ఐయిందని ముక్త గ్రహించింది.

అది దేనికి దారి తీస్తుందోనని ఆమెకు భయంగా ఉంది.

భానుప్రకాష్ మాటల్లోంచి -

“నువ్వు నాకు నచ్చావు...”

“నువ్వు తలచుకుంటే కార్లలో తిరగ్గలవు. మేడలో మసలగలవు. ఫోన్లలో మాట్లాడగలవు... నా స్నేహం నీ కందుకు సహకరిస్తుంది...”

పగైరాలామె చెవుల్లో గింగురు మంటూ అతడు తన్ను ప్రలోభ పెడుతున్నాడని చెప్పక చెబుతున్నాయి. ఆ ప్రలోభానికి తాను లొంగకూడదనుకున్నప్పుడల్లా-

“ఎదుటి వాళ్ళు నా మాటలు చిరాకు కలిగించినా వింటారు. ఎందుకంటే

నేను వారికో వారిభర్తలకో అధికారిని కనిక ! ఎందరి భవిష్యత్తో నాచేతుల్లో ఉంది కనుక ..." అన్న భానుప్రకాష్ హెచ్చరిక ఆమెను భయపెడుతోంది.

ముందు ముందేం జరుగుతుంది ?

ఏదో జరుగుతుందనే ముక్తకు అనిపిస్తోంది.

ఏం జరుగుతుందో కూడా ఆమెకు చూచాయగా తెలుస్తోంది.

ఏదో కొత్త భయమూ మెనావహించగా - మనసు స్థిమితం తప్పడం వల్ల ఆమె ఏపని మీదా దృష్టి మళ్ళించ లేకపోతోంది.

ఆమె అలాంటి స్థితిలోనే ఉండగా గౌతమ్ ఇల్లు చేరుకున్నాడు.

వస్తూనే అతడుత్సాహంగా భార్యను కౌగలించుకుని ఉక్కిరి బిక్కిరి చేశాడు.

"ఏం జరిగిందండీ ?" అంది ముక్త ఆశ్చర్యంగా.

"ఆఫీసులో మన హోదా పెరిగింది -"

"ఎలా ?"

"మనింట్లోకి ఫోన్ వస్తోంది ..."

"ఎందుకు ?"

"ఎందుకేమిటి ? ఆఫీసులో నాపై అధికారికే ఫోనులేదు. ముఖ్యమైన ఆఫీసు పనుల నిమిత్తం నాకు ఆఫీసు ఫోనిచ్చింది ... బాస్ ఇన్‌ఫ్లుయన్స్ వల్ల బహుశా వారం రోజుల్లోనే మనకు ఫోన్ రావచ్చు ..."

"బాస్ అంటే ..."

"వేరే చెప్పాలా ? ఈ రోజే పేరంటానికూడా వెళ్ళొచ్చావు ...."

"భానుప్రకాష్‌గారా ?" అంది ముక్త.

"అవును ..."

ముక్త చటుక్కున - "ఈ ఫోన్ విషయం మీ కెప్పుడు తెలిసింది ?"

"పావు తక్కువ అయిదుకి. ఆఫీసులో బాస్ అందరిముందూ ఎనౌన్స్ చేశాడు. చాలామంది అసూయపడ్డారు. చాలాకాలంగా ఈ ఫోన్ శాంక్షన్ తమకొస్తుందంటే తమ కొస్తుందని అంతా ఆశపడుతున్నారు. నా కొస్తుందని నేనుకలలో కూడా అనుకోలేదు. ఇదీజే ప్లెజంట్ సర్ప్రయిజ్ ...." అన్నాడు గౌతమ్.

"ఆయన మీకిది పావు తక్కువ అయిదుకి చెప్పాడా ?"

"అవును - ఏం ?"

ముక్త నిట్టూర్చింది. పేరంటంలో తన్ను కలుసుకుని మాట్లాడినాకనే భానుప్రకాష్ ఈ నిర్ణయం తీసుకున్నాడు.

అతడు తనకు తన శక్తి చూపిస్తున్నాడు.

"ఈ వార్త నీకు నేననుకున్నంత సంతోషం కలిగించినట్లులేదు..." అన్నాడు గౌతమ్ నిరుత్సాహంగా.

"ఫోన్ వస్తే మనమేం చేసుకుంటాం ? దాని వల్ల మనకేం లాభం ?"



"కంపెనీ మనకు ఫోనిచ్చిందంటే మన అంతస్తు పెరిగిందన్నమాట ... మనింట్లో ఫోనుందంటే చుట్టు పక్కల మన కెంతపేరు ? ముక్త ! నువ్వు పాదం పెట్టిన వేళ మంచిది. మనింట్లోకి ఫోన్ వస్తోంది. ఆ తర్వాత కారు ...."

"కారా ? అప్పుడే మన కంత డబ్బా ?" అంది ముక్త ఆశ్చర్యంగా.

"అంతా నీ విశేషం. ఏమొచ్చినా నీ కారణంగానే...." అన్నాడు గౌతమ్ అభిమానంగా.

"నువ్వు కార్లలో తిరగ్గలవు. మేడల్లో మసలగలవు. ఫోన్లో మాట్లాడగలవు ..." అన్న భానుప్రకాష్ మాటాలామెకు మళ్ళీమళ్ళీ గుర్తొస్తున్నాయి.

"ఏమొచ్చినా నీ కారణంగానే ..." అన్నాడు గౌతమ్.

"నువ్వునాకు నచ్చావు -" అన్నాడు భానుప్రకాష్.

ఇవన్నీ కలిపితే ...

"ఏమిటదోలాగున్నావు ?" అన్నాడు గౌతమ్.

"బానే ఉన్నానే !"

"లేదు. రోజూలా లేవు నువ్వు ...."

ముక్త ముక్తసరిగా నవ్వింది.

"పేరంటంలోగానీ ఎవరేనా ఏమైనా అన్నారా ?"

ముక్త తల అడ్డంగా ఊపింది.

"అసలు నిన్నడగనే లేదు. పేరంటం విశేషాలేమిటి ?"

చెప్పాలని ముక్తకు నోటి చివరి దాకా వచ్చింది.

"సంస్కారం గురించి ఆలోచించే ముందు - ఈ సంభాషణను నీ భర్తకు చెప్పుకోగలవేమో ఆలోచించు. అతడి సంస్కారం గురించి తెలుస్తుంది నీకు -" అన్న భానుప్రకాష్ మాటలామె నప్పుడు హెచ్చరించాయి.

భానుప్రకాష్ తనతో మాట్లాడినాకనే భర్తకు ఫోన్ సదుపాయమిచ్చాడు. ఈ విషయం గౌతమ్‌కు తెలిస్తే ఏమనుకుంటాడు ?

"గౌతమ్ సంస్కారాన్ని నేను శంకించకూడదు -" అనుకుంది ముక్త.

అయితే ఆమె రిస్కు తీసుకోలేదు.

## 4

గౌతమ్ ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

అంట్లుతోమి, బట్టలుతికి పనిమనిషి వెళ్ళిపోయింది.

నవల నొకటి తీసుకుంది ముక్త.

పుస్తకాలంటే ఆమెకిష్టం. పుస్తకాలకంటే కబుర్లంటే యింకా యిష్టం. కబుర్ల కెవరూ దొరకనప్పుడు పుస్తకాలు చదువుతుందామె.

నవల ఆమె అభిరుచులకు తగ్గట్టుగానే ఉంది.

ఒక స్త్రీ - ఇద్దరు ప్రేమికులు ...

ఇద్దరిలో ఒకడు దుర్మార్గుడు, ధనవంతుడు.

రెండోవాడు మంచివాడు, పేదవాడు.

స్త్రీ రెండోవాణ్ణి ప్రేమించింది. కానీ ఆ స్త్రీ తండ్రికి క్యాన్సర్. జబ్బుకు వైద్యం చేయించాలంటే డబ్బు, పలుకుబడి కావాలి.

దుర్మార్గుడు స్త్రీకి సాయం చేస్తానన్నాడు. ఆమె తనను పెళ్ళి చేసుకోవాలని షరతు పెట్టాడు. ఆమె తనను పెళ్ళి చేసుకుంటే ఆమెకోసం తన జీవిత పథాన్ని మార్చుకుని మంచివాడిగా మారిపోతానన్నాడు. ఆమె తనను కాదంటే మరింతగా చెడిపోతానని - అందుకామే బాధ్యురాలవుతుందనీ బెదిరించాడు.

ఒకపక్క జబ్బుతో బాధపడుతున్న తండ్రి...

మరొకపక్క నూరేళ్ళ పంటకై ఎదురుచూసే పేదప్రియుడు ...

ఆమె ఏం చేయాలి ?

కొంచెంగా అటూ యిటూ మార్పులతో శతాబ్దాలుగా కవులను, రచయితలను ప్రభావితం చేస్తున్న కథ యిది.

నవలా రచయిత నేర్పుగా కథను నడిపిస్తున్నాడు.

ముక్త నవల చదువుతూ లోకాన్ని మరిచిపోయింది.

టెలిఫోన్ ట్రింగుమనేవరకూ ఆమె నవలాలోకంనుంచి బైటపడలేదు.

"హలో !" అందామె.

"మాట్లాడేది ముక్తకదూ ?" అందవతలిగొంతు.

"అవును - మీరెవరు ?"

"భానుప్రకాష్..."

ఉలిక్కిపడింది ముక్త. నవల కల్గించిన మత్తంతా విడిపోయిందామెకు.

"ఫోన్ బాగా పనిచేస్తోందా ?" అన్నాడు భానుప్రకాష్.

"ఊఁ"

"అప్పుడప్పుడు నీతో కబుర్లు చెప్పుకుందుకు వీలుగా ఉంటుందని నేనే మీయింట్లో ఫోన్ ఏర్పాటు చేయించాను..."

"తెలుసు..."

"తెలివైన దానివి నువ్వు..."

"థాంక్స్..."

"ఒప్పుకుంటే చాలదు. నీ తెలివి చూపించాలి...."

"అంటే ?"

"ఆధునిక ప్రపంచంలో భర్తల ప్రగతికి-అందమైన భార్యలే సోపానాలు..." అన్నాడు భానుప్రకాష్.

"ఇలాంటి మాటలు నాకు నచ్చవు ...."

"చిన్నప్పుడు మానాన్న రోజూ చదువుకోమని నీతిబోధ చేస్తే నాకు నచ్చేది



కాదు. అయినా విన్నాను. చదువొచ్చింది..."

"అయితే..."

"ప్రతి విషయంలోనూ ప్రగతి పథానికి కొన్ని మార్గాలుంటాయి. అవి మనకు నచ్చకపోయినా అనుభవజ్ఞులు చెబితే వినాలి..."

"ఒక వయసు దాటేక మనిషికెవరి సలహాల్లూ అవసరముండవు..."

"నిజం చెప్పావు. కానీ నీకింకా ఆ వయసు దాటలేదు...."

"ఇంతకీ మీరేం చెప్పదల్చుకున్నారు ?"

"మీరు కాదు - నువ్వు..."

ముక్త ఫోన్ పెట్టేయాలనుకుంది కానీ అది సరికాదనిపించి, "అంత సులభంగా నేనందర్నీ నువ్వనలేను...." అంది.

"సులభ పద్ధతి నేను చెబుతానుగా...."

"వద్దు...." అంది ముక్త.

"ముక్తా ! ఒకరికొకరెదురైనప్పుడెన్నో మాట్లాడుకోవాలనిపిస్తుంది. మొహమాటం అడ్డొస్తుంది. అలాంటప్పుడుత్తరాలు పనికొస్తాయి. మనిషికి నోటితో చెప్పలేనివి ఉత్తరాల్లో అక్షరాల రూపంలో చెప్పుకోవచ్చు. కానీ అందరికీ ఉత్తరాలు రాయడం రాదు. పెదవి పల్కించే అక్షరాన్ని కాగితం మీదకు తరలించడం ప్రత్యేకమైన కళ. ఆ కళలో ప్రావీణ్యం లేక ఎందరో స్నేహితుల్లయి ఎదుటపడి మాట్లాడుకోలేక, అటు ఉత్తరాలు రాసుకోలేక - ఒకరికొకరు క్రమంగా దూరమైపోయారు. మనకలాంటి దుర్గతి లేదు. మనముత్తరాలు రాసుకోనవసరం లేదు. మాట్లాడుకునేటప్పుడు ఒకరికొకరెదురు పడనవసరమూ లేదు. ఫోనుంది. నిస్సంకోచంగా, చనువుగా మాట్లాడుకుందాం..."

"మాట్లాడుకోవడానికేముంది ?" అంది ముక్త.

"నువ్వు నా అందాన్ని పొగుడు. వింటాను..."

"నావల్లకాదు..."

"పోనీ - నీ అందాన్ని నేను పొగుడుతాను. విను..."

"వాటీజ్ దిస్ మిస్టర్ భానుప్రకాష్ ...." అంది ముక్త.

"దిసీజ్ ఫర్ మై ఇన్స్పిరేషన్..."

"మీ ఇన్స్పిరేషన్తో నాకేంపని ?"

"నా ఇన్స్పిరేషన్వల్ల లాభమంతా నీకే ! ఇన్స్పిరేషన్తో నేను కంపెనీ గురించి పాటుబడలేదు. కంపెనీ వృద్ధిపొందుతుంది. కంపెనీతోపాటే నీ భర్తకూడా."

ముక్త మాట్లాడలేదు.

"ఫోన్ పెట్టేయకు. నేనింకా మాట్లాడుతున్నాను..."

ముక్త వింటోంది. అతడామె అందాన్ని పొగుడుతున్నాడు.

పేరంటంలో ఆమె ఎలా తనకు కనబడిందో వర్ణిస్తున్నాడు.

ఆ వర్ణనలో అసభ్యత లేదు. కవిత్వముంది.

ఆ పొగడ్తలామెకు సంతోషం కలిగించలేదు.

"ఎలా ఉన్నాయి నా మాటలు ?" అన్నాడు భానుప్రకాష్ చివర్లో.

"అందే ?"

"నీ అందానికి న్యాయం చేకూర్చానా ?"

"నాకు పెళ్ళి కాగానే నా అందానికి న్యాయం జరిగింది. వేరెవ్వరూ నా అందానికి న్యాయం చేకూర్చ నవసరం లేదు...."

"ముక్తా ! భర్త వేరు, స్నేహితుడు వేరు. ఈ తేడా తెలుసుకునే సంస్కారం నువ్వు పెంచుకోవాలి. ప్రస్తుతానికి సెలవు...."

అవతల ఫోన్లో క్లిక్‌మన్న చప్పుడు వినిపించింది.

ముక్త తనూ ఫోన్ పెట్టేసింది.

## 5

వారంరోజుల్లో ముక్తకు భానుప్రకాష్‌నుంచి నాలుగుసార్లు ఫోన్ వచ్చింది.

అతడి మాటల్లో సభ్యత లోపించడంలేదు. కానీ అతడి ఊహలు మాటల్లో స్ఫురిస్తున్నాయి. ముక్తకు చాలా ఇబ్బందిగా ఉంటోంది.

స్నేహం పేరిట అతడు చనువు పెంచుకుంటున్నాడు.

ఆఫీసులో గౌతమ్‌కు ప్రత్యేకమైన గౌరవం లభిస్తోంది.

"అందమైన భార్యలు - భర్తల ప్రగతికి సోపానాలు...."

ఇదీ భానుప్రకాష్ అభిప్రాయం.

అతడు తననుంచి ఏమాశిస్తున్నాడు ?

ఈ విషయంలో భానుప్రకాష్ ముందడుగు వేయకుండా ఎలా ఆపాలి ?

అప్పుడామెకు సంధ్య గుర్తుకొచ్చింది.

సంధ్య తననెంతో ఆప్యాయంగా ఆదరించింది. ఆమెకు భర్త గురించిన నిజం తెలుసా ? తెలియక పోతే తను చెబితే .... ?

ముక్త సంధ్యను ఫోన్లో పలకరించింది.

"ఫోన్లో ఏం మాట్లాడు కుంటాం ? కాసేపు మా యింటికి రాకూడదూ ?" అంది సంధ్య.

ముక్త సరే ననాలనుకుంది. కానీ ...

పేరంటం జరుగుతున్నప్పుడే భానుప్రకాష్ వచ్చేసి తనతో తను కోరిన విధంగా మాట్లాడ గలిగాడు. ఇప్పుడు మళ్ళీ యింటికి వస్తే ...

"నేను మీ యింటి కొచ్చాను. మీరే ఓ సారి మా యింటికి రావాలి..."

"మీరు కాదు - నువ్వు ..." అంది సంధ్య.

చటుక్కున ముక్తకు భానుప్రకాష్ మాటలు గుర్తు కొచ్చాయి.

"అంత సులువుగా కొత్త వారిని నేను నువ్వన లేను ..."

"కానీ మావారి మాట నాకు శిలాశాసనం ...."



"మీ వారి గురించే మాట్లాడాలి. మా యింటికి రండి ..."

"ముక్తా ! అక్కా చెల్లెళ్ళలా మసలమని నీ గురించి వారు నాకు చెప్పారు. నువ్వు నన్ను నువ్వనకపోతే - ఏ చనువుతో - ఏ పేరంటమూ లేకుండా మీ యింటికి రాను ..." అంది సంధ్య.

"అక్కా ! అర్జంటుగా నీతో మాట్లాడాలి. మా యింటికిరా -" అంది ముక్త అలా మాట్లాడినందుకామె అదోలాగుంది.

కాసేపట్లో కారామె యింటి ముందాగింది.

డ్రైవర్నోగంట పోయాక రమ్మని పంపేసింది సంధ్య.

ముక్త ఆమెను సాదరంగా ఆహ్వానించింది. సంధ్య ఇల్లంతా చూసి - ఎంత బాగా సర్దుకున్నారని మెచ్చుకుంది.

"మీ యింటితో పోలిస్తే - ఇదేముంది ?" అంది ముక్త.

"మాయింట్లో ఉన్నది వైభవం. మీయింట్లోది అభిరుచి...." అంది సంధ్య.

"వైభవంలో అభిరుచి ఉండదా ?"

"ఉండొచ్చు. కానీ అభిరుచికి వైభవం అవసరం లేదు..."

"నువ్వు చాలా బాగా మాట్లాడగలవు..."

"అంతా మావారిదగ్గర నేర్చుకున్నాను...."

ముక్త వెంటనే -"నీకు మీవారంటే ఆరాధన-కదూ ?" అంది.

"ఏ భార్యకు భర్తంటే ఆరాధన ఉండదు ?" అంది సంధ్య.

ముక్త మాట్లాడలేదు.

"మా వారికి అందముంది, పర్సనాలిటీ ఉంది, సంభాషణా చాతురి ఉంది, హోదా ఉంది, డబ్బుంది. అటువంటి వారినారాధించకపోతే ఆ భార్యలోనే ఏదో లోపముండాలి...." అంది సంధ్య.

"కానీ మెరిసేదంతా బంగారం కాకపోవచ్చు ...." అంది ముక్త.

"అంటే ?"

"మీవారి గురించి నేను చెడ్డగా విన్నాను...."

సంధ్యముఖం ఎర్రబడింది- "చెడ్డగా అంటే ?"

"వారి ప్రవర్తన మంచిదికాదుట ..."

"వ్యాపారంలో సీదాసాదాగా పైకొచ్చేవారుండరు..."

"ప్రవర్తన అంటే వ్యాపారానికి సంబంధించిందికాదు ... ఆయన వ్యక్తిత్వానికి సంబంధించి...."

"చెప్పు..." అంది సంధ్య.

"ఆయన ఆడపిల్లల్ని వలలో వేసుకుందుకు ప్రయత్నిస్తారుట..."

సంధ్య నవ్వి - "ఆడపిల్లల వలలో ఆయన పడకుండా ఉండాలని నాకోరిక. వలలో వేసుకుందామన్నా ఆయనకా అవకాశమేదీ ?" అంది.

"అంటే?"

"ఆయన వల వేద్దామనుకునేలోగానే వాళ్ళాయనపై వల విసురుతున్నారు. ఆయన పొజిషన్ అలాంటిది..."

"తనకీ - ఆయన పొజిషన్‌కీ సంబంధమేమిటి?"

"కంపెనీ ఆయనవల్ల బాగా వృద్ధిలోకొచ్చింది. ఇతర కంపెనీలాయన్ని లాగాలని చూస్తున్నాయి. కొందరికాయన పతనమైతే చాలు. మరి కొందరికైతే - ఆయన్ని తమవైపు ఆకర్షించుకోవాలనుంది ...." అని - "అందుకోసం ఆయనపై ఆడపిల్లలను ప్రయోగిస్తారు. అర్థమయిందా?" అంది సంధ్య.

"కానీ .... నేనింకోలా విన్నాను ..." అంది ముక్త.

"ఏం విన్నావో చెప్పు..."

"ఆయననే ఆడపిల్లలవెంట పడతారనీ ... అవతల యువతి వివాహితా కాదా అన్న విచక్షణకూడా చూడరనీ...."

సంధ్య నవ్వి - "ఎవరు చెప్పారు?" అంది.

ముక్త తడబడింది.

సంధ్య తనే మళ్ళీ - "వారుగానీ నీతో మాట్లాడేరా?" అంది.

"లేదు -" అంది ముక్త వెంటనే.

"ఒకవేళ వారు నీతో చనువుగా మాట్లాడినా తప్పుగా అర్థం చేసుకోకు"

"ఎందుకని?"

"ఒక వయసులో మగాడికి ఆడది - ఆడదానికి మగాడు గొప్ప ఆకర్షణ! ఆ ఆకర్షణలోంచి బైటపడి తప్పించుకోవడం ఎక్కడో మహాత్ములకు తప్ప సాధ్యం పడదు. మావారికి తన ప్రవర్తన గురించి పట్టుదల ఉంది. వారిపై నాకు నమ్మకముంది. కానీ ఒకోసారి తన మనసు చలిస్తుందేమోనని వారిభయం. పరాయి స్త్రీలతో చనువుగా ఉండడంద్వారా - అనుకోకుండా ఎదురయ్యే ఆకర్షణలనుంచి తప్పించుకోవడానికి వీలవుతుందని ఆయన అనుకుంటారు..."

"అదెలా సాధ్యం?"

"నిగ్రహానికికూడా ప్రాక్టీసుండాలికదా! భార్యముందు చేసే ప్రాక్టీసు ప్రాక్టీసు కాదు. అలవాటుపడ్డ మనిషి కాబట్టి..." అంది సంధ్య - "అందుకని మావారు కొత్త వాళ్ళతో చనువుగా ఉంటూంటారు. ఒకసారేమయిందో తెలుసా? వారూ - మరదలూ ఒక రాత్రంతా ఒకేగదిలో పడుకున్నారు. నేను తన్ను గమనిస్తున్నట్లుకూడా వారికి తెలియదు. ఇద్దరూ శుభ్రంగా పక్కెరక్కుండా పడుకున్నారు. వాళ్ళను కాపలా కాసి కాసి నాకే నిద్రలేదు...."

"నువ్వు చెబుతున్నది నాకు చాలా చిత్రంగా ఉంది -" అంది ముక్త.

"వారంటే నాకు ఆరాధన! వారిపట్ల నాకు పూర్తి నమ్మకం. వారి ప్రవర్తన సరైనది కాదనడానికి కళ్ళారా చూడగల ఋజువు లభిస్తే నా కళ్ళే నన్ను మోసం



చేస్తున్నాయనుకుంటాను తప్ప వారి ననుమానించను -" అంది సంధ్య.

"నీ నమ్మకం నీ భర్తను పాడు చేయడమే కాదు. ఎందరో పతివ్రతలను పతితల్ని చేస్తుంది -" అంది ముక్త.

"పతివ్రతలు పతితలు కాలేరు -" అంది సంధ్య.

"ఎందుకు కాలేరు?"

"తమను తాము రక్షించుకొనేందుకు పతివ్రతలు భర్తలపై ఆధారపడరు. తాము పూర్తిగా అసహాయులైనపుడు దేవుడే వారిని రక్షిస్తాడు..."

"అలా రక్షించక పోతే?"

"వారు పతివ్రతలు కారని అర్థం..."

"నీ భర్త సరైన వాడు కాదనడానికి నాకు కొన్ని ఋజువులు లభించాయి. కొంత ముందడుగు వేస్తే విషయం నీ ముందుకూడా ఋజువు చేయగల్గను..."

"ఏమిటి నీ ఋజువులు?"

"ఇప్పుడు చెప్పను..."

"ఎప్పుడు చెబుతావు?"

"అదీ నాకు తెలియదు. నేను రిస్కు తీసుకోవాలి. నాకు దేవుడి మీద నమ్మకం లేదు...." అంది ముక్త.

"దేవుణ్ణి నమ్ము. తన భక్తుల కాయనెప్పుడూ అన్యాయం చేయడు...."

"తప్పు చేసిన వాళ్ళే దేవుణ్ణి నమ్ముతారని మా నాన్నగారంటారు...."

సంధ్య ముఖం పాలిపోయింది "-నేను తప్పు చేశానంటావా?"

"నీ భర్తనంతలా నమ్మడం నువ్వు చేస్తున్న తప్పు. అందు వల్ల అతడు బరి తెగించి ప్రవర్తించే అవకాశముంది..."

"నువ్వు మా వారినెందుకు పట్టించావు?" అంది సంధ్య.

"ఆలోచిస్తే నీకూ మీ వారి గురించి అర్థమవుతుంది. అతడు నిన్ను వెర్రి బాగులదాన్ని చేసి ఆడిస్తున్నాడు. లేని పక్షంలో తను ప్రత్యేకించి ఆడవాళ్ళతో చనువుగా మాట్లాడడమెందుకు? మరదలితో ఒక్కడు వేరేగదిలోపడుకోవడమెందుకు?"

సంధ్య ఏదో చెప్పబోయి ఆగిపోయింది. కాసేపుండి నెమ్మదిగా -"నీకు మావారి మీద దురభిప్రాయం కలిగింది. ఎందుకో చెబితే పోగొట్టగలను...." అంది

"మీవారి మీద ఆడ పిల్లలు వలలు విసురుతారన్నదబద్ధం. అతడే ఓ ఆడ పిల్ల మీద వల విసురుతున్నాడిపుడు...."

"ఎవరామె?"

"ఎవరైనా ఆమె పతివ్రత!"

"ఎవరా పతివ్రత?" అంది సంధ్య.

"ఎవరైనా ఈపరిస్థితినుంచెలా బైటపడాలా అని ఆమె భయపడుతోంది. ఆమెకు భర్తే ప్రాణం. భర్తే లోకం, భర్తే దైవం. కానీ ఆ భర్తనే రూపు రేఖలు

లేకుండా నాశనం చేయగలడు నీ భర్త. అందుకే ఆమె భయపడుతోంది....”

“ఇందుకు ఋజువుందా?”

“ఋజువు నీకు చూపిస్తాను. నమ్ముతావా ?”

“నువ్వు చూపిస్తే నమ్ముతాను...” అంది సంధ్య.

“చూపాలనే ఉంది. కానీ నేను భయపడుతున్నాను. ఋజువు చూపడానికి కొంత రిస్కు తీసుకోవాలి. అప్పుడు దేవుడు రక్షించకపోతే ?”

“మావారు నిజంగానే ఓ ఆడ పిల్లపై వల విసిరితే, ఆమె పతివ్రతే అయితే నీకేమీ భయం అవసరం లేదు. రక్షించడానికి నేనున్నాను. నేనే దేవుణ్ణనుకో... నన్ను నమ్ము...” అంది సంధ్య గంభీరంగా.

“అక్కా !” అంది ముక్త అప్రయత్నంగా.

“మా వారే మనిద్దరికీ ఈ వరస కలిపారు. అందువల్ల అక్కగా నాకు నీ బాధ్యత ఉంది నీ సమస్యేమిటో నిర్మొహమాటంగా చెప్పు. నేను చేయ గలిగింది చేస్తాను....” అంది సంధ్య.

“ప్రస్తుతానికి నువ్వేమి చేయనవసరం లేదు. మీ వారినో కంట కని పెడుతూండు –” అంది ముక్త.

## 6

“నువ్వింట్లో అడుగు పెట్టిన వేళావిశేషం మంచిది. ఆఫీసులో నాకు మంచి ఫ్యూచర్ కనబడుతోంది–” అన్నాడొకరోజున గౌతమ్ భార్యతో.

“ఫ్యూచర్ ఎలా కనబడుతుందండీ ?” అంది ముక్త.

“బాస్ నన్ను విపరీతంగా అభిమానిస్తున్నాడు. కొన్నాళ్ళపాటు నిన్ను గమనిస్తూంటాను. నాకు నచ్చితే నా తర్వాత నా అంతటివాణ్ణి చేస్తానని ఆయన నాతో అన్నాడు...” సంతోషంగా అన్నాడు గౌతమ్.

భర్త ముఖంలోని సంతోషం ముక్తను భయపెట్టింది.

“ఒకవేళ మీ బాస్‌కు మీరు నచ్చకపోతే ?” అందామె.

“ఎందుకు నచ్చను ?”

“ఎందుకంటే ఏం చెప్పగలం ? దురదృష్టమనుకోండి...”

“నువ్వుండగా దురదృష్టం నావంక కన్నెత్తికూడా చూడలేదు....”

ముక్త ఉలిక్కిపడి భర్తవంక పరీక్షగా చూసింది. అతడి ముఖంలో ఆనెక్ష భానుప్రకాష్ కనిపించాడు.

“అందమైన భార్యలు ప్రగతికి సోపానాలు...” అంటున్నాడతడు.

“ఏమన్నారూ ?” అందామె.

“నువ్వు నా అదృష్టానివంటున్నాను...”

“అదృష్టమంటే ఎలాంటి అదృష్టాన్ని ?”

“చెప్పడం నాకు చేతకాదు...”



“మీలో సమర్థత ఉంది. అందుకే మీ బాస్ మిమ్మల్నభిమానిస్తున్నారు. బాస్‌కు మీ అవసరముంది. మీరు లేకుండా ఆయన కంపెనీ నడవదు. అలాంటప్పుడొకోసారి అసూయకూడా బయల్దేరుతుంది. మీ బాస్ మిమ్మల్నుద్యోగంనుంచి తొలగించవచ్చు. అప్పుడు మీకు మరో కంపెనీ స్వాగతం పలుకుతుంది...” అంది ముక్త.

“ప్లీజ్ ముక్తా ! నువ్వలా మాట్లాడవద్దు –” అన్నాడు గౌతమ్.

“ఎందుకని ?”

“ఉద్యోగం విషయంలో నేను నువ్వనుకున్నంత గొప్పవాణ్ణి కాను. మా నాన్నగారి రికమెండేషన్‌మీద వచ్చిందీ ఉద్యోగం నాకు. ఇదిపోతే ఎక్కడకు వెళ్ళినా ఈ ఉద్యోగమెందుకు పోయిందో సంజాయిషీ యిచ్చుకోవాలి. మా బాస్ బాగా పలుకుబడి ఉన్నవాడు పగబట్టాడంటే ఈ చుట్టుపక్కలెక్కడా నాకు మంచినీళ్ళుకూడా పుట్టవు”

భర్త కళ్ళలోని భయాన్ని స్పష్టంగా చదివింది ముక్త.

“అంటే మీరు పూర్తిగా మీ బాస్‌పై ఆధారపడిపోయారు భవిష్యత్తుకోసం –” అంది ముక్త.

“అసలా ఆధారం దొరకడమే ఓ అదృష్టం. దొరికిన ఆధారాన్ని వదులుకోలేను...” అన్నాడు గౌతమ్.

“చాలా బాగుంది. ఇలాగైతే మీరు బాస్‌కి పూర్తిగా లోకువైపోతారు. అతడొకరోజున మీనుంచి ఎలాంటి ప్రతిఫలాన్నైనా కోరవచ్చు....”

“ఆయన నానుంచి ప్రతిఫలమెందుకు కోరతాడు ? కోరినా నేనాయనకివ్వగలిగిన దేముంది ?” అన్నాడు గౌతమ్.

ముక్త మాట్లాడలేదు.

“మంచి మూడ్ పాడుచేసేశావు ముక్తా !” అన్నాడు గౌతమ్.

“నా మూడ్‌కూడా పాడయింది. తనభర్త అందరికంటే అధికుడిగా ఉండాలని ఏ భార్యయినా కోరుకుంటుంది. మీరు బాస్‌కి బానిసలని తెలిస్తే నాకెంతో బాధగా ఉంది –” అంది ముక్త.

“బాస్‌కి బానిస కావడంలో వింతేముంది ? అది మన దేశ సాంప్రదాయం ?” అన్నాడు గౌతమ్.

“మీ బలహీనతను మన సంప్రదాయానికంటగట్టకండి –”

“నీకు ప్రపంచం తెలియక అలాగంటున్నావు...” అన్నాడు గౌతమ్.

హైస్కూల్లో హెడ్మాస్టరుకి మిగతా టీచర్సు బానిసలు. వ్యక్తిత్వముండి ఎదిరించినవాడు మన్య ప్రాంతాలకు ట్రాన్స్ఫరవుతాడు. యూనివర్సిటీలో ప్రొఫెసరుకి మిగతా స్టాఫంతా బానిసలు. వ్యక్తిత్వం చూపాలనుకుంటే చాలు– భవిష్యత్తును కోల్పోతాడు. ఇది విద్యారంగం.

లేబరేటరీల్లో డైరెక్టరుకి సైంటిస్టులు బానిసలు. స్వతంత్ర భావాలున్నవాడు నోబెల్ ప్రైజుకొట్టే విశేషం కనిపెట్టినా అది లాబొరేటరీ గోడలు దాటి బయటకురాదు.

అది వైజ్ఞానిక రంగం.

క్రీడారంగంలో ఆటగాళ్ళు యాజమాన్యానికి బానిసలు. రాజకీయ రంగంలో రాజకీయ వాదులు నాయకులకు బానిసలు.

శతాబ్దాల తరబడి భారతీయులు విదేశీయులకు బానిసల్లాగా ఉన్నారు. స్వతంత్రం వచ్చేక స్వదేశీయులకు బానిసలయ్యారు.

"మీరన్నది నిజమే కావచ్చు. కానీ కనీసం నా ముందైనా ఈ నిజం ఒప్పుకోకండి. నాకు తృప్తిగా ఉంటుంది...." అంది ముక్త.

"ఏంచేయమంటావో చెప్పు ..." అన్నాడు గౌతమ్.

"కాసేపు మీ బాస్‌ను తిట్టండి -"

"బాస్‌నా ?"

"ఊఁ"

"ఎందుకు ?"

"నా సంతోషంకోసం !"

"నా బాస్‌ను తిడితే నీకెందుకు సంతోషం ?"

"ఆఫీసులో అతడితో ఎలా ఉంటున్నారో నాకు తెలియదు. ఇంట్లోనైనా అతణ్ణి తిడితే - అతడికంటే మీరే గొప్పవారనిపిస్తుంది ... అదో తృప్తి నాకు..."

గౌతమ్ ఏదో అనబోయి చుట్టూ చూశాడు.

చిన్న పడకగది. గది మధ్యన మంచం. మంచంపై తనూ, ముక్త...

పైన సీలింగ్‌కు వ్రేలాడుతోంది ఫ్యాన్ ...

గది తలుపు గడియ వేసుకున్నారింట్లో ఎవరూ లేకున్నా...

గదిచుట్టూ గోడలు...

తిరుగులేని ఏకాంతమది !

ఆ ఏకాంతంలో తనూ, ముక్తా...

అక్కడ తనేం చేసినా చూసేవారు లేరు.

తనేమన్నా వినేవారు లేరు. ఏదీ గోడదాటి పోదు.

చుట్టూ చూశాడు గౌతమ్. గోడలు కనిపించాయి.

"తిట్టండి !" అంది ముక్త.

"వద్దు..."

"ఏం ? ఇక్కడెవరూ లేరుగా..."

"ఏమో - గోడలకు చెవులుంటాయంటారు...."

ముక్తకు కోపం వచ్చి మరోవైపు తిరిగింది. గౌతమ్ ఆమె నడుంమీద చేయి - "ముక్తా ! నువ్వు పక్కనుండగా ఎవరినో తిట్టి సమయం వృధా చేసుకోలేను. వర్ణిస్తాను...." అన్నాడు,



ముక్త మాట్లాడలేదు.

అతడామెను వర్ణించ సాగాడు. తనకంటికామె ఎలా కనబడుతుందో వర్ణిస్తున్నాడతడు.

ముక్తకు భర్త మాటలు వినబడటం లేదు. ఫోన్లో భానుప్రకాష్- పేరంటంలో తానెలా కనబడిందీ వర్ణిస్తున్నాడు. ఆ మాటలేవి ఆమె చెవుల్లో గింగురు మంటున్నాయి.

భానుప్రకాష్ వర్ణనముందు గౌతమ్ వర్ణన పేలవంగా ఉంది.

ముక్త భానుప్రకాష్‌కి పరాయి ఆడది. గౌతమ్‌కి కట్టుకున్న భార్య. గౌతమ్ వర్ణన పేలవంగా ఉండడానికదే కారణమా ? పరాయి స్త్రీ పుట్టించగల భావావేశం భార్య పుట్టించలేదా ?

లేక - భానుప్రకాష్ బాస్. గౌతమ్ బానిస. తన బానిస మనస్తత్వాన్ని భార్య ముందుకూడా వదిలిపెట్టలేక పోవడంవల్ల ముక్తకు గౌతమ్ వర్ణన పేలవంగా అనిపించిందా ?

లేక...

ముక్త ఉలిక్కి పడింది.

గౌతమ్ తనకు కట్టుకున్న భర్త. భానుప్రకాష్ పరాయి మగాడు. అందుకే తనకతడి వర్ణన బాగుందా ?

ఇందులో ఏది నిజం ?

నిజమేదైనప్పటికీ-ఆ రాత్రి తొలిసారిగా ఓ విశేషం తెలుసుకున్నాడు గౌతమ్.... అన్ని సమయాల్లోనూ ఆడవాళ్ళు పొగడ్తలకు లొంగరు !

## 7

"హలో ముక్తేనా మాట్లాడుతుంది..."

ముక్త ఆ గొంతును సులభంగా గుర్తుపట్టింది - "ఊఁ"

"ఇంట్లో వుండవేమోనని భయపడ్డాను...."

ముక్త మాట్లాడలేదు.

"గౌతమ్ చాలా ఉత్సాహంగా ఉంటున్నాడాఫీసులో. అతడిలో ఆశలు పెంచేస్తున్నాను. ఇదంతా ఎందుకో తెలుసా ?"

"తెలియదు !"

"అతణ్ణి ఎవరెస్ట్ శిఖరాగ్రానికి తీసుకుని వెడతాను. అప్పుడు...."

"వద్దు..." అంది ముక్త.

"ఏమిటివద్దు !"

"మావారినేమీ చేయొద్దు..."

"ఏమీ చేయను. అంతా నీలో ఉంది ..."

"నేనేంచేయాలి ?"

"నువ్వేమీ చేయనవసరం లేదు. అభ్యంతర పెట్టకుండా ఉంటే చాలు..." అన్నాడతడు.

"హద్దుమీరుతున్నారు..."

"నువ్వుకూడా నన్ను నువ్వను. హద్దులవే తొలగి పోతాయి..."

"హద్దులు తొలగాలని నేననుకోవడంలేదు...."

"నీభర్త ఎవరెస్టు శిఖరంవైపు వెడుతున్నాడు...."

ముక్తకేం చెప్పాలో తెలియలేదు.

గౌతమ్ ఎవరెస్టు శిఖరంవైపు వెడుతున్నమాట నిజం. కానీ అతడినెలా ఆపాలి ?

"మాట్లాడుముక్తా ! ఫోన్‌లో విన్నా నీగొంతు తియగా ఉంటుంది...."

"మావారికన్యాయం చేయొద్దు –" అందామె.

"అది నీలో ఉంది..."

"నన్ను మావారి కన్యాయం చేయమనొద్దు..." అంది ముక్త.

"ఆధునిక ప్రపంచం గురించి నీకు తెలియక పోవడం నా దురదృష్టం... నీ కారణంగానైనా సరే తను పైకి రావాలని నీభర్త అనుకుంటాడు. అది అన్యాయమని నువ్వనుకుంటే నీకు ప్రపంచజ్ఞానం లేదనుకోవాలి ..."

"నాకున్న జ్ఞానం చాలు నాకు...."

"ఈ ఊళ్ళో అజంతా ఇంటర్నేషనల్ ఉంది. రోజూ మధ్యాహ్నం రెండు గంటలకిఊళ్ళోని ఆఫీసర్ను కార్లలో అక్కడికి వస్తారు. ఎందుకో తెలుసా ?"

"తెలియదు..."

"ఎందుకు ?"

"తమ భార్యలనక్కడ విగవిడిచి వెడతారు ...."

"వారక్కడ హోటల్లో కొన్ని గంటలు గడిపి వెడతారు. ఫలితంగా వారికి కార్లు, బంగళాలు, వైభోగాలు..."

ముక్త మాట్లాడలేదు.

"నెలకు రెండుమూడు వేలు తెచ్చే ఆఫీసరు కేవలం జీతంమీద వైభవాన్ని కొనుక్కోలేడు. అందుకే ఇటీవల ఆఫీసర్లు – అందమైన భార్యలనే పెళ్ళిచేసుకుంటున్నారు. వారిని తమ ఆర్థిక, సాంఘిక ప్రగతికి సోపానాలుగా వాడుకుంటున్నారు"

ముక్తకు వళ్ళు జలదరించింది – "నేను నమ్మను" – అందామె.

"నీ నమ్మకంతో పని లేకుండా జరిగిపోతున్న నిజమిది...."

"అయినా సరే నేను నమ్మను..."

"ఎందుకని ?"

"మీరు చెప్పారు కాబట్టి !"

"పోనీ – నీ భర్తను నమ్ముతావుగదా ! అతణ్ణే అడిగి తెలుసుకో..."



"ఈవిషయమై ఒకరినడగాల్సిన అవసరం. కుతూహలం నాకు లేవు ...."

"అలాగనకు నీ మంచి కోరి చెప్పాను .... ఆలోచించుకో ..."

అవతల క్లిక్ మంది.

## 8

"ఏమండీ ! అజంతా ఇంటర్నేషనల్ గురించి మీకు తెలుసా ?" అందిముక్త భర్తతో.

"అదో స్టార్ హోటలు ..."

"అదికాదు ... ఇంకా ..."

"ఇంకా అంటే ?"

తటపటాయిస్తూనే తన సందేహం బైట పెట్టింది ముక్త.

"ఎవరు చెప్పారు నీకు ?" అన్నాడు గౌతమ్ ఆశ్చర్యంగా.

తడబడింది ముక్త

"ఎవరు చెప్పారు ?"

"ఈ వీధిలోనే – పంకజంగారని ..."

పంకజం, ముక్త చాలా అరుదుగా మాట్లాడుతుంటారు. పంకజం నోరు మంచిది కాదని ఆ వీధిలో చెప్పుకుంటారు. అందుకే ఆపేరు చెప్పిందామె.

గౌతమ్ నిట్టూర్చి – "నీకిది తెలుసుకోవాలనెందుకనిపించింది ?" అన్నాడు.

"లోకంలో యిలాంటివి కూడా ఉంటాయా అని !"

"ఉంటాయి –" అన్నాడు గౌతమ్.

"అంటే యిది నిజమేనా ?"

"ఊఁ"

"ఛీ – ...." అంది ముక్త.

"ఛీ అనడానికిందులో తప్పేముంది ?"

"మీ కిందులో తప్పు అనిపించడం లేదు ?"

"లేదు ..."

"తప్పు అనిపించడం లేదూ ?" రెట్టించింది ముక్త.

"సావధానంగా విను...." అన్నాడు గౌతమ్.

శీలం అన్నది మనిషి కల్పించుకున్నది. ధర్మం అన్నది బలహీనుడు బలవంతుల్ని శాసించడాన్నికి సృష్టించినది. విదేశాల్లో శీలానికి ప్రాముఖ్యత లేదు. పవిత్రతకు అర్థం లేదు. ఆ దేశాలు సిరి సంపదలతో తులతూగి పోతున్నాయి. ఏయేదేశాల్లో పవిత్రత పేరిట స్త్రీ అణగ ద్రొక్కబడుతోందో – ఆదేశాలు ప్రగతి సాధించ లేక పోతున్నాయి.

దేశ ప్రగతి మనిషిలో ఉంది. మనిషి ప్రగతి స్త్రీలో ఉంది. స్త్రీ దానికి ప్రాముఖ్య

తనూ, పవిత్రతను అంటి గట్టి-అవి కాపాడ్డానికే జీవితాన్నంకితం చేసినంత కాలం మనిషి ప్రగతిని సాధించలేడు.

అజంతా ఇంటర్నేషనల్‌కు తమ భార్యలను తీసుకుని వెడుతున్న ఆ ఆఫీసర్లందరూ సంతులు. శీలం ప్రాముఖ్యతను తొలగిస్తే వారు చేసిందాన్లో తప్పేమీ లేదు. వారిప్రగతినెవరూ ఆపన్యూలేరు.

"అయితే అలాంటి తప్పు మీరు కూడా చేస్తారా!" అంది ముక్త.

గౌతమ్ ఉలిక్కిపడి -"నా సంగతి నేనాలోచించ లేదు -" అన్నాడు.

"ఆలోచించండి -" అంది ముక్త.

"ఛీ!" అన్నాడు గౌతమ్ అప్రయత్నంగా.

"మీ విషయంలో ఛీ అనిపించినదితరులకు మంచిదెలాగవుతుంది?" అంది ముక్త భర్తను నిలదీస్తూ.

"సారీ ముక్తా! నేనెక్కువదూరమాలోచించ లేదు. నువ్వడిగినప్పుడు నేనింకోలా ఆలోచిస్తున్నాను. అసలేం జరిగిందంటే..."అన్నాడు గౌతమ్.

ఆరోజు ఆఫీసులో భానుప్రకాష్ గౌతమ్‌ని పిలిచాడు. మాటల సందర్భంలో అజంతా ఇంటర్నేషనల్ ప్రసక్తి వచ్చింది. ఆయన అక్కడి విశేషాలను సమర్థించాడు. గౌతమ్ బాస్ అభిప్రాయాలన్నింటితోటీ ఏకీభవించాడు. అవే యింటి దగ్గర రిపీట్ చేశాడు.

"ఈ అభిప్రాయలు నావికాదు. నా బాస్‌వి..."

"మీ అభిప్రాయం కూడా చెప్పండి...."

"ఎందుకు నీకంత పట్టుదల?"

"ఈ విధంగానైనా మీ బాస్‌ను తిడతారని!"

"నా బాస్‌ను తిట్టాలని నీకంత పట్టుదలెందుకు? ఆయన నిన్నేం చేశాడు...?" అన్నాడు గౌతమ్.

ముక్త తడబడింది. అప్పుడామెకు మళ్ళీ పంకజం గుర్తు కొచ్చింది.

పంకజం పేరునే మళ్ళీ ఉపయోగించు కుందామె.

"అజంతా ఇంటర్నేషనల్‌కి మీబాస్ కూడాఆడ వాళ్ళని రప్పించు కుంటాడట. పంకజం చెప్పింది..."

గౌతమ్ ముందు తడబడినా తర్వాత తేలికగా నవ్వేసి -"బాస్ చాలా మంచివాడు. అయనకు డబ్బుంది కాబట్టి ఏం చేసినాసాగుతుంది. నేనాయనకు జూనియర్నైనా నా దగ్గరెంత చనువుగా ఉంటాడు. తన ప్రవర్తనను తప్పు పట్టినేనసహ్యించుకుంట నన్ను భయం కాబోలు....ఆయన పనిగట్టుకుని రోజు నాదగ్గర ఆ హోటలు ప్రసక్తి తెచ్చి సమర్థించు కున్నాడు. అయనెలాంటివాడైనా ఆరాధన తప్పదు నాకు. అయినా నన్ను కన్విన్స్ చేయలని చూస్తాడు. గొప్ప సంస్కారం కదూ!" అన్నాడు.

"ఇదేం సంస్కారం?" అంది ముక్త.



"ఆలోచించి చూడు. నీకే కనబడుతుంది సంస్కారం!"

"నాకేం కనబడ్డం లేదు...పరాయి ఆడవాళ్ళతో హోటళ్ళలో కులికే మీ బాస్‌లో సంస్కారాన్నెలా చూడగలను?" అందిముక్త.

"శ్రీకృష్ణుడు గోపిలను వస్త్రాపహరణం చేస్తే అది రాసలీల అయింది. శ్రీకృష్ణుడుదేవుడయ్యాడు. నా బాస్ నాకు దేవుడు -" అన్నాడు గౌతమ్.

"కానీ - ఆయనలో వేరే దురుద్దేశ్యముందేమో ఆలోచించారా?"

"వేరే దురుద్దేశ్యమంటే?"

"ఆయన పనిగట్టుకుని అజంతా ఇంటర్నేషనల్ గురించి మీకెందుకు చెప్పాడు? అది తప్పుగాదని మీ దగ్గరెందుకు సమర్థించాడు?"

"ఎందుకో చెప్పానుగా - అదాయన సంస్కారం..."

"సంస్కారంకాక దురుద్దేశ్యమేం కనబడలేదా మీకు!"

"నీ కేదైనా కనబడిందా?"

"నేను మీ సంగతడిగాను..."

"నా సంగతి నేను చెప్పాను. నీసంగతి చెప్పు..."

"ఈయన కెలా చెప్పేది?" అనుకుంది ముక్త. మనసులో ఆమెకు రవంత అనుమానం కూడా వచ్చింది. భర్తకు నిజంగా అసలు విషయం స్ఫురించలేదా, నటిస్తున్నాడా అని!

## 9

"హలో!" అంది ముక్త భయపడుతూనే.

"స్వీట్ వాయిస్...."

ఆ గొంతు ముక్త గుర్తుపట్టి - "ఎందుకు మీరిలా మాటిమాటికీ ఫోన్ చేసి నన్ను వేధిస్తారు?" అంది.

"నాలో వేదన ఉంది...." అన్నాడు భానుప్రకాష్.

"ప్లీజ్ - ఇక మీదట ఇలా ఫోన్ చేయొద్దు..."

"నువ్వు నన్ను కలుసుకొంటానంటే ఫోన్ చేయడం మానేస్తాను..."

"కలుసుకోవడమెందుకు?"

"నీ భర్త ప్రగతి కోసం"

"నా భర్తకీ ప్రగతి చాలు...."

"ఆమాట అతడిని చెప్పమను..."

"మిమ్మల్నతడు తెలుసుకోలేక పోతున్నాడు. తెలుసుకో గలిగిన రోజున ఏమైనాజరుగుతుంది!"

"నన్నతడు తెలుసుకున్నాడు. నువ్వే అతణ్ణి తెలుసుకోలేక పోతున్నావు..." ఫోన్లో నవ్వాడు భానుప్రకాష్.

"అంటే ?"

"ఇంకా నీకు నీ భర్త ఉద్దేశ్యం తెలియ లేదంటే అతడు నీ దగ్గర నటిస్తూండి ఉండాలి. లేదా నువ్వువాతో అబద్ధం చెబుతూండాలి ..."

ముక్తకు చాలా ఉక్రోషం వచ్చింది. –"ఇక ముసుగులో గుద్దులాటఅనవసరం. ఈరోజు నేను నా భర్తతో మాట్లాడి అసలు విషయం తేల్చేస్తాను..." అంది.

"అందులో ప్రమాదముంది...." అన్నాడు భానుప్రకాష్.

ఫోన్‌లో అతడు వివరిస్తూంటే ముక్తకు మతి పోయినట్లయింది.

జరుగు తున్నది గౌతమ్‌కి తెలుసు. తన పరువు కాపాడు కోడం కోసం అతడు తెలియ నట్లు నటిస్తున్నాడు. ముక్త నిల దీసి అడిగితే తనకేమి తెలియదనే అంటాడతడు. పైగా యింత కాలం నాకెందుకు చెప్పలేదంటాడు. నీ ప్రోత్సాహం లేకుండానే వ్యవహారమింతవరకూ వచ్చిందా అంటాడు అక్కడ్నించి మాట మాటికీ భార్య ననుమానించడం ప్రారభించి ఆమెకు జీవితంనరకం చేస్తాడు. అంత వరకూ గౌతమ్‌లో మనిషిని చూసిన ముక్త ఇక మీదట రాక్షసుణ్ణి చూస్తుంది.

"అలా ఎన్నటికీ జరగదు...." అంది ముక్త.

"ఎందుకు జరగదు? అసహాయుడైన మనిషి తన కంటే అసహాయుల్ని వెతుక్కుని వేధిస్తాడు. వివాహిత స్త్రీకి మించిన అసహాయులు మన దేశంలో ఎక్కడా ఉండరు..." అన్నాడు భానుప్రకాష్.

ముక్త ఆలోచనలో పడింది.

"నామాట విను ముక్తా ! ఇందులో నువ్వు చేస్తున్న తప్పేమీ లేదు. నువ్వు తప్పను కుంటున్నావు కాబట్టి అది తప్పయింది. తప్పు కాదని అనుకో అప్పుడు సమాజంలో నీస్థాయి తప్పు చేస్తినా ఎవరు వేలెత్తి చూపలేని ఎత్తుకు చేరుకుంటుంది. ఈ ప్రసక్తి నీ భర్త ముందు తీసుకురాకు. అతడు తనకేమీ తెలియ నట్లే ఊరుకుంటాడు అతడిని నిలదీశావా – నీకేమీ ప్రయోజనముండదు. వ్యవహారం నీకే ఎదురు తిరుగుతుంది..."

"మీరు నన్ను బ్లాక్ మెయిల్ చేస్తున్నారు..."

"లేదు. మధ్య తరగతి బలహీనతలు నీలోంచి తొలగించాలని ప్రయత్నిస్తున్నాను. అదీ నీ మంచికే !"

"నామంచి గురించి మీ కెందుకు ?"

"నాకు నువ్వు నచ్చడం నీ అదృష్టం...."

"ఏమైనా నేనిది భరించలేను. వారితో మాట్లాడతాను ...."

"బాగా ఆలోచించుకో. అందువల్ల ఎదురయ్యే ప్రమాదానికి నువ్వు తట్టుకోలేవు. భర్త నిరసనను ఏ స్త్రీకూడా భరించలేదని నాకు తెలుసు. నీభర్తపై నీ కింకా నమ్మకముంటే – అది పోగొట్టడానికి గట్టి ఋజువు చూపగలను. అందుకు నువ్వో పని చేయాలి. నాలుగు రోజుల్లో నీ భర్త కోటూరు ప్రోగ్రాముంటుంది. కూడా నువ్వొ



వెళ్లొచ్చు. రాననకు. అతడితో బయల్దేరివెళ్ళి తర్వాతేంజరుగుతుందో చూడు ..."

ముక్త ఆలోచనలో పడింది.

అవతల ఫోన్ క్లిక్ మంది.

## 10

గౌతమ్ చాలా ఉత్సాహంగా ఉన్నాడు.

"బాస్ చాలా మంచివాడు. ఇలాంటి గౌరవం మనకరుదుగా లభిస్తుంది ...." అన్నాడతను.

మర్నాడే గౌతమ్ టూర్లో ఒక పట్టణం చేరుకోవలసి ఉంది. ప్రయాణం కంపెనీ కార్లో. మకాం కంపెనీ గెస్ట్‌హౌస్‌లో. కూడా అతను భార్యను కూడా తీసుకుని వెళ్ళొచ్చు.

"కొత్తగా పెళ్ళయిన వాళ్ళం. ఇంకా పిల్లల్లేరు. బాస్ మనకిది హనీమూన్ ప్రిప్పసుకోమన్నాడు ..."

నిట్టూర్చింది ముక్త.

"ఇంతమంచి విశేషం నీకేమీ ఆనందం కలిగించడం లేదా?"

"లేదండి – పంకజం మాటలు నన్ను భయపెడుతున్నాయి ..."

"ఎందుకు ?"

"మీ బాస్ ప్రవర్తన మంచిది కాదని మీకు తెలుసు. ఇదంతా ఆయనెందుకు చేస్తున్నట్లు ?"

"ముక్తా ! మన సుఖం మనం చూసుకోవాలి. ఆయన ప్రవర్తనతో మనకేం పని ?"

"పంకజమంటుంది – ఈరోజుల్లో మగాళ్ళుకూడా బరితెగించారని – డబ్బు కోసం భార్యల్ని బాసుల కప్ప జెబుతారని ...

"అలాంటి వాళ్ళు లేక పోలేదు."

తటపటాయిస్తూనే – "మీరూ అల్లాంటి వాళ్ళే నంటుందామె–" అంది ముక్త.

గౌతమ్ ముందులిక్కిపడ్డాడు. తర్వాత – "ఏమన్నావ్ ?" అన్నాడు. అతడి మాట నీరసంగా వచ్చింది.

ముక్త మాట్లాడలేదు.

"ఒకసారి ఆపంకజాన్ని పిలు. ఏకిపారేస్తాను ...."

"వద్దులెండి. అవని నేనే చేశాను ..."

"అసలా పంకజాని కంత ధైర్య మెలాగొచ్చింది ?"

"మనింట్లో పోసురదని ఏడుపు. మీలాంటి చిన్న ఉద్యోగుల కిలాంటి నదు పాయాలుత్తినే రావుట ..."

గౌతమ్ ఆవేశపడ్డాడు – "ఆ పంకజం భర్త – ఆమెనలాగుపయోగించుకుంటున్నాడేమో అనలేక పోయావా ?"

"అన్నానండీ – ఆమె చలించలేదు. పంకజం అందంగా ఉండదు. తన భర్తకలాంటి దురూహలు లేవు కాబట్టే తన మంచితనాన్ని చూసి ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడంటుందామె ..."

"తనకందంలేదని అందమైన వాళ్ళంటే అసూయన్నమాట ..."

"అందమైన భార్యలు – భర్తల ప్రగతికి సోపానాలు .... అంటుందామె !"

ఆవేశంలో గౌతమ్ గొంతు వణికింది – "ఇలా మాట్లాడే మనిషినొక్క క్షణం కూడా భరించ కూడదు. నేనేవెళ్ళి నిలదీస్తానోరోజు ..."

"అలాంటి వాళ్ళతో నోట్లో నోరు పెట్టి లాభం లేదండీ. ఊరూ వాడా ఏకం చేస్తారు ..." అంది ముక్త.

గౌతమ్ కొద్ది క్షణాలాయాసపడి – "బాస్టర్డ్ ... బగర్ ... " అన్నాడు.

"ఎందుకండీ ఆమెను తిట్టడం ? నేను మిమ్మల్ని నమ్ముతున్నాగా ?" అంది ముక్త భర్త పంక ఆప్యాయంగా చూస్తూ.

"నువ్వు నమ్మడం దాకా బాగానే ఉంది. కానీ అసలనుమానమంటూ ఎందుకు రావాలి ?" అన్నాడు గౌతమ్ ఉక్రోషంగా.

"అవసరే – అసలు సంగతి తెలిస్తే మీరింకా మండిపడతారు..."

"ఏమిటది ?"

"పంకజం అంటుందీ – అజంతా ఇంటర్నేషనల్ గురించి నీ భర్తకు చెప్పి చూడు. ఆతడికోపం రాదు సరిగదా – వారందర్నీ సమర్థిస్తాడు. నీ భర్త బాస్ ప్రవర్తన మంచిని కాదను. అతడు దాన్ని సమర్థిస్తాడు. అంటే అర్థం నీ భర్త కుడా అలాంటి వాడేనని..."

"ఇదంతా ఎందుకు చెబుతున్నావు ?" అన్నాడు గౌతమ్ అనుమానంగా.

"ఆమె చెప్పిందంతా విని ఊరుకోవడం తప్ప నాకు మీ మీదే అనుమానమూ లేదని చెప్పడానికి. నేనేం చెప్పినా భయం మీ బాస్ గురించే తప్ప మీ గురించికాదు. మీరే చెప్పండి. మీ బాస్ కన్ను మీ భార్య మీద పడితే ఏం చేస్తారు ?"

"అలాజరగదు...."

"జరిగితే ఏం చేస్తారో చెప్పండి...."

"ఆ పంకజం నీ బుర్ర పాడు చేసి లేని పోని సందేహాలు కలిగిస్తోంది. అలా జరగదని నేనంటున్నాగా ?"

"జరుగుతుందని నేననడంలేదు. జరిగితే ఏం చేస్తారూ అంటున్నాను..."

గౌతమ్ కళ్ళెర్ర బడ్డాయి. మనిషి ఆవేశంతో ఊగాడు.

ముక్త అతడినే పరీక్షగా చూస్తూ – "ఇది నిజమైన ఆవేశమే ! నటన కాదు...." అనుకుంది.

గౌతమ్ ఇంకా ఆవేశంతో ఊగుతూనే ఉన్నాడు.

"చెప్పండీ !" అంది ముక్త.



గౌతమ్ ఏదో చెప్పబోయి – "ఎందుకులే – గోడలకు చెవులుంటాయి –" అన్నాడు.

ముక్త ఉత్సాహం చల్లారి పోయింది.

ఆమె ఆలోచనలో పడింది.

ఏం జరుగుతుందిప్పుడు ?

గౌతమ్ ఆమెను సమీపించి దగ్గరగా తీసుకుని – "ముక్తా ! కొన్ని ప్రశ్నలు వేసి నన్ను వేధించకు. నేను పిరికివాణ్ణి. కానీ నా పిరికితనం సమాజానికి భయపడి పారిపోయేలా చేయకు. సమాజం బలానికెదురు తిరక్కుండా చేస్తుంది. నా పిరికితనమే నాకు రక్ష. నా ప్రగతికి సోపానం. అయితే యిదంతా ఎందుకనుకుంటున్నావ్? నీకోసం ... నిన్ను సుఖపెట్టడంకోసం ... నిన్ను సంతోషంగా ఉంచడంకోసం ... సుఖసంతోషాలతో నువ్వు నాదానివిగానే ఉండాలి. నువ్వు నాదానివికాక మరేమైనా అయితే .... నేనేంచేస్తానో తెలియదుకానీ ఏమైపోతానో తెలుసు. ముక్తా ! నువ్వు చెప్పింది జరిగితే నేను పిచ్చివాడినైపోతాను ...." అన్నాడు.

ముక్తకతడి శరీరం చల్లగా తగుల్తోంది....

అతడు నటిస్తున్నాడో నిజం చెబుతున్నాడో ఆమెకు తెలియలేదు. కానీ – "నా వల్ల మీకన్యాయం జరుగదు...." అని మనసులో అనుకొందామె.

## 11

మర్నాడాఫీసుకు వెడుతూ – "సాయంత్రం నాలుగింటికి కార్లో వస్తాను. సామాను సర్ది రెడీగా ఉండు. ఆలస్యంచేస్తే బాగుండదు..." అన్నాడు గౌతమ్.

అతడు వెళ్ళిపోగానే సంధ్యకు ఫోన్ చేసిందామె.

సంధ్య యింట్లో లేదు. రాత్రిదాకా రాదని తెలిసింది.

ముక్త భయపడింది. తన ప్రయాణం గురించి సంధ్యకు చెప్పాలనుకుందామె. అప్పుడు సంధ్య భర్తవిషయంలో జాగ్రత్త పడుతుంది.

ఈ టూరు గురించామెకు బెంగగానే ఉంది.

ఎంత చెప్పినా గౌతమ్ కర్థంకాదు. అతడు వేరే లోకంలో ఉన్నాడు.

"ముక్తా ! నువ్వు చెప్పింది జరిగితే నేను పిచ్చివాడినైపోతాను –" అన్న భర్త మాటలామెను కలవర పెడుతున్నాయి.

పన్నెండు గంటలకు ముక్తకు ఫోన్ వచ్చింది భానుప్రకాష్‌నుంచి ;

"ముక్తా ! టూరుకు వస్తున్నావుకదూ ! వస్తావని నాకు తెలుసు. రానన్నా నీ భర్త నిన్నొప్పించగలడని నా నమ్మకం...."

"వస్తున్నాను. ఇప్పుడేం జరుగుతుంది ?"

"తినబోతూ రుచి అడగడమెందుకు ?"

ఫోన్ క్లిక్‌మంది.

ఫోన్ వచ్చేక ముక్త భయం పెరిగింది.

భానుప్రకాష్ చాలా పకడ్బందీగా పథకం వేస్తున్నాడు. గెస్ట్‌హౌస్‌లో ఏదో జరుగుతుంది. ఏం జరుగుతుందో మరి!

సాయంత్రం నాలుగింటికి భర్త వచ్చేసరికి ముక్త తయారై సిద్ధంగా ఉంది.

ఇద్దరూ కార్లో వెనకసీట్లో కూర్చున్నారు.

ప్రయాణం ప్రారంభమైంది.

గౌతమ్ ఉత్సాహంగా భార్యకేమేమో చెబుతున్నాడు.

ముక్త అన్యమనస్కంగా వింటూ – భర్తకావిషయం తెలియకుండా ఉంచాలని చూస్తోంది.

గౌతమ్ తన ధోరణిలో తానున్నాడు.

రెండుగంటల ప్రయాణం వారిని గెస్ట్‌హౌస్‌కు చేర్చింది.

అక్కడ వారికోసం ఓ గది సిద్ధంగా ఉంది.

గదిలో ఖరీదైన కార్పెట్. గోడలకు శృంగార భరితమైన ఆయిల్ పెయింటింగ్స్. హంసతూలికా తల్పాలు. అతిథి మర్యాదకై కుషన్ సోఫాలు. స్టీరియో సెట్టు, కలర్ టెలివిజన్...

గదిలోని హంగులు చూసి దిమ్మెర పోయింది ముక్త.

గదికి అటాచ్‌డ్ బాత్ ఉంది. బాత్రూంలో టబ్బుంది. షవరుంది.

భార్యాభర్తలిద్దరూ అప్పటికప్పుడు వేణ్ణీళ్ళ స్నానం చేశారు.

మొదటిసారిగా టబ్బుస్నానం చేసింది ముక్త. అనుకూలంగా లేకపోయినా చాలా హాయిగా ఉంది. భర్త దగ్గర్లోనే ఉండి సాయపడుతూంటే అదొక మధురానుభూతిగాకూడా ఆమెకు తోచింది.

అప్పుడామె భానుప్రకాష్ గురించి పూర్తిగా మరిచిపోయింది.

వారి స్నానాలు కాగానే బాయ్ వారిద్దరికీ కాఫీ, బిస్కట్లు తెచ్చిచ్చి – భోజనం గురించి అడిగాడు.

తమకేంకావాలో పురమాయించింది ముక్త.

బాయ్ వెళ్ళిపోయాడు ఇద్దరూ వేడివేడి కాఫీలు తాగారు.

"ఇంత మంచి మంచముండగా సోఫా ఎందుకు?" అన్నాడు గౌతమ్

ఇద్దరూ మంచం మీద మేనులు వాల్చారు.

పాతాళంలోకి కృంగి పోతున్నట్లూ స్వర్గంలోకి తేలి పోతున్నట్లూ...

ఒకే సారి రెండు విభిన్నానుభూతులు కలిగాయి ముక్తకు.

ఆమె భర్త వైపు తిరిగింది. అతడామె వైపు తిరిగాడు.

"ఇంట్లో కూడా యిలాంటి బెడ్డుంటే?" అందామె.

అతడు బదులివ్వకుండా ఆమె నడుం మీద చేయివేసి దగ్గరగా లాక్కున్నాడు. అతడు లాక్కోనవసరం లేకుండానే ఆమె అతడికి దగ్గరగా జరిగింది.

ఇద్దరూ ఒకరికొకరు హత్తుకుని పోయారు.



ఏదో కొత్త లోకంలో ఉన్నట్లుందిద్దరికీ!

అతడామెను మృదువుగా పెదవులపై చుంబించాడు.

ఎన్నడూ కలుగని వింత పరవశం – ఆమెకు కలిగిందారోజున....

సరిగ్గా అప్పుడే....

గదిలో ఫోన్ మ్రోగింది.

మంచం పక్కనే టెలిఫోన్...

గౌతమ్ ఒక చేతిని చాసి ఫోన్ అందుకున్నాడు. అతడు ఫోన్లో మాట్లాడుతూంటే ముక్తకతడో పెద్ద అధికారిలా తోచాడు.

ఆమె అతడి మాటలు వినడంలేదు. ఆరాధనాపూర్వకంగా అతడి వంకే చూస్తోంది. అతడి చేష్టలను గమనిస్తోంది.

ఉన్నట్లుండి అతడామెను విడిపించుకొని ఫోన్ పెట్టేసి మంచం దిగాడు.

కల కరిగినట్లయింది ముక్తకు.

గౌతమ్ బట్టలు మార్చుకుంటున్నాడు.

"ఏం జరిగిందండీ?" అంది ముక్త.

"నేను బయటకు వెళ్ళాలి...."

"ఎందుకు?"

"ఒక పార్టీతో మాట్లాడాలి ..."

"ఇప్పుడా?"

"ఇప్పుడేమరి..." అన్నాడతడు. తన బ్రీఫ్‌కేస్‌లో కొన్ని పేపర్లు సర్దుతున్నాడు.

"అంత అర్జంటేమిటండీ – రేపొస్తానని చెప్పండి...."

"అలా వీలుకాదు. ఆయనకు రెండు ఫ్యాక్టరీలున్నాయి. బిజీమనిషి. నేనిప్పుడే వెళ్ళాలి. డిన్నర్ టైంకి వచ్చేస్తానుగా..." అన్నాడతడు.

"సరదాగా గడుపుదామనుకున్నాను..."

"రాత్రంతా మనదేనని మర్చిపోకు...."

గౌతమ్ వెళ్ళిపోయాడు.

ముక్తకు నిరుత్సాహంగా ఉంది. కాలక్షేపంకోసం ఆమె అక్కడున్న పుస్తకాలు చూసింది.

ఇంగ్లీషుతోపాటు తెలుగు పత్రికలున్నాయక్కడ.

ఓ పత్రిక తీసి పేజీలు తిప్పింది.

"వాత్స్యాయన కామసూత్రాలు...."

చటుక్కున పత్రిక మూసి మరొకటి తీసింది, పేజీలు తిరగేయగానే ఓకథ. కథలో ఏముందో చూపే బొమ్మ. బొమ్మలో ఉన్నది ఆడా, మగా....లేనిది వారికి దుస్తులు ...

అప్పుడు ముక్త అక్కడున్న ఇంగ్లీషు పత్రిక తీసుకుంది. అందులో సినిమా విశేషాలు నచ్చుతాయి.

స్మితాపాటిల్ బిడ్డనెవరు పెంచుతారు ?

భానుప్రియ రాకతో శ్రీదేవిస్థానం పడిపోతుందా ?

మన్‌మోహన్‌దేశాయ్ అమితాబ్ లేకుండా హిట్ పిక్చర్లు తీయగలడా ?

నామ్‌తర్వాత కుమారగౌరవ్, సంజయ్‌దత్‌లు కలిసి నటిస్తారా ?

ఇవే దేశాన్ని వేధించే సమస్యలన్నట్టు పత్రికలవాళ్ళు రాస్తూంటే చదువుతుంది ముక్త. ఆమెకు కాసేపు డైవర్షన్ కావాలి. తెలుగు పత్రికలివ్వలేని డైవర్షనాపత్రిక ఇచ్చిందామెకు.

ఆ సమయంలో కాలింగ్‌బెల్ మ్రోగింది.

భర్త వెనక్కి వచ్చాడేమోనన్న ఆశతో ముక్త తనే వెళ్ళి తలుపు తీసింది. గుమ్మంలోనున్న వ్యక్తిని చూడగానే ఆమె గుండె అదిరిపోయింది.

అతడు భానుప్రకాష్ !

అతడి ముఖంలో చిరునవ్వు.

అతడి చూపులో - కాటేసే కాలనాగు కనబడుతోంది.

ముక్త అలాగే నిలబడిపోయింది.

ఒక్కనిముషం తనూ అలాగే నిలబడినా అతడు చటుక్కున చొరవ చేసి ఆమెను తప్పుకుని లోపలకు ప్రవేశించాడు.

ముక్త మామూలు మనిషి కావడానికి కాసేపు పట్టింది.

ఆమె గదిబయటకు చూసింది.

హాలు - అక్కడెవ్వరూలేరు.

తలుపు వదిలి ఆమె వెనక్కి తిరిగింది.

తలుపు దానంతటదే వెనక్కి పడింది.

మరోసారి ఉలిక్కిపడింది ముక్త.

"ఎయిర్ కండిషన్డ్ గదిలో తలుపు దానంతటదే పడుతుంది -" అన్నాడు భానుప్రకాష్.

ముక్త మాట్లాడలేదు.

"రా - ఇలా కూర్చో -" అన్నాడు భానుప్రకాష్.

అతడు కూర్చోమన్న వైపు చూసిందామె.

అదతడికెదురుగా ఉన్న సోఫా.

"కొంతలో కొంత మర్యాద చూపిస్తున్నాడు -" అనుకుంటూ ఆమె అతడి కెదురుగా కుర్చుంది.

అతడుత్సాహంగా ఉన్నాడు.

ఆమె మనసు చిక్కబెట్టుకుందుకు ప్రయత్నిస్తోంది.



"నేను మాట్లాడ్డం ప్రారంభిస్తాడు. నువ్వు మామూలుగా ఉండు..." అన్నాడు భానుప్రకాష్ గంభీరంగా.

"ఎందుకొచ్చావిక్కడికి ?" అందామె.

"చాలా థాంక్స్... మొదటి సారిగా నువ్వు నన్ను నువ్వన్నావు. అంటే నా దారిలోకి వస్తున్నావన్నమాట ..." అన్నాడు భానుప్రకాష్.

"నీ అభిప్రాయం తప్పు. నా దృష్టిలో నీ విలువ పడిపోయింది. అందుకే నువ్వన్నాను ..."

"అంటే ఇన్నాళ్ళూ పడలేదన్నమాటగా ! అంటే ఫోన్లో మాట్లాడిన మాటలు నీ దగ్గర నా విలువను నిలబెట్టుకున్నాయనేగా ... ఇంకా చాలా థాంక్స్...."

"నువ్వు నన్నెందుకిలా వేధిస్తున్నావ్..." అంది ముక్త దీనంగా.

"నీకు తెలియకుండా నువ్వే నన్ను వేధిస్తున్నావు. నాకు తెలిసి నేను నిన్ను వేధిస్తున్నాను. రెండూ తెలిశాకకూడా ఒకరికొకరు వేధించుకోవడమెందుకు ? అవగాహనతో దగ్గరవుదాం-" అన్నాడు భానుప్రకాష్.

"ప్లీజ్ - ఇలా మాట్లాడకు -" అందామె.

"కంగారు పడకు. నీభర్త యిప్పట్లో రాడు..."

ముక్త మాట్లాడలేదు.

"ఇక్కణ్ణించి నేను ఫోన్ చేశాకనే అవతల పార్టీ నీ భర్తను వదిలిపెడతాడు. కాబట్టి నీకాభయమవసరంలేదు...." అన్నాడు భానుప్రకాష్.

"నాభయం నా భర్త వస్తాడనికాదు. నువ్వున్నావని..."

"దూరంగా ఉన్నంతసేపే నువ్వు నాకు భయపడతావు. ఒక్కసారి దగ్గరైతే భయం పోయి ఆకర్షణ పుడుతుంది-" అన్నాడు భానుప్రకాష్.

ముక్త చురుగ్గా అతడివంక చూసింది.

"నిజం చెబుతున్నాను. నాకు నీ చూపులంటె చాలా యిష్టం. ఆడదాని అందమంతా చురుకుతనంలో ఉంది-" అన్నాడు భానుప్రకాష్.

"నీవంటి కుసంస్కారులు పై అధికారులుగా ఉండడం వల్లనే దేశమిలా అధోగతిలో ఉంది-" అంది ముక్త.

భానుప్రకాష్ ముఖం ఎర్రబడింది- "ముక్తా ! హద్దులు మీరుతున్నావు-" అన్నాడతడు కోపంగా.

"హద్దులు మీరుతున్నది నేనుకాదు. నువ్వు..."

"ఇప్పుడు నేను తలచుకుంటే ఈ గదిలో నిన్నేమైనా చేయగలను. నువ్వు నన్ను ప్రతిఘటించలేవు. నీకెవరూ సాయం రారు. అయినా నేను మంచిమాటలతో నచ్చజెప్పి నా కార్యం చక్కబెట్టుకోవాలనుకుంటున్నాను. బలాత్కారం నాకు నచ్చదు. పరస్పరానురాగంలో ఒకరి కొకరు చేరువ కావాలనుకుంటున్న నాది కుసంస్కారమని నువ్వంటున్నావు..."

"నీది కుసంస్కారమని ఒకసారికాదు - వెయ్యిసార్లంటాను ... నీ హద్దులు తెలుసుకోకుండా ఇలా వచ్చి నాతో మాట్లాడ్డం కుసంస్కారమని నేనేకాదు-సంస్కారం తెలిసిన వారెవరైనా అంటారు..."

"మాటి మాటికీ హద్దుల గురించి మాట్లాడుతున్నావు. ఒక విషయం తెలుసుకో. నీకు హద్దులున్నాయి. అయినా నువ్వు వాటిని మీరుతున్నావు. నాకు హద్దులు లేవు. నేను లేని హద్దుల్ని సృష్టించుకుని వాటిలోపలే ఉంటున్నాను..."

"నీకెందుకు హద్దుల్లేవు ?"

"ఒక్కసారి నాకు దగ్గరగా రా - నీకూ హద్దులుండవు...."

"నాకు హద్దులే యిష్టం..."

"హద్దులు బలహీనులికి. పేదవారికి. అసమర్థులకు హద్దులను తొలగించు కొనడం హోదా. నేను నీ భర్తకు హోదా యిస్తాను. అందుకు నీవు హద్దుల్ని మర్చిపోవాలి."

"నీ అభిమానానికీ, సలహాలకూ కృతజ్ఞతలు. నువ్వింక యిక్కణ్ణించి వెళ్ళు."

"నా సంస్కారం నన్నిక్కణ్ణించి వెళ్ళమనే అంటోంది. అందుకే వెళ్ళిపోతున్నాను. కానీ ఒక్క విషయం గుర్తుంచుకో-ఈ గెస్ట్‌హౌస్‌లో నువ్వు చూస్తున్న వైభవం - నీ యింట్లోకి తరలి రాగలదు. అందుకు నీకు నా సహకారం అవసరం."

"థాంక్స్...."

"నువ్వు నన్నిలా బయటకు పంపేశావని తెలిస్తే ఈ ఏర్పాటు చేసిన నీ భర్త నిరుత్సాహ పడతాడు ..." అన్నాడు భాను ప్రకాష్.

అతడి మాటలకు షాక్ తిండి ముక్త. ఆమె ఆ షాక్‌నుంచి తేరుకునేలోగా భానుప్రకాష్ అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

## 12

గెస్ట్‌హౌస్‌కి వచ్చిన మర్నాడు మధ్యాహ్నంమూడింటికి గౌతమ్ మరో పార్టీతో మాట్లాడ్డానికి వెళ్ళాడు. అతడు వెళ్ళిన పదినిముషాల్లో భానుప్రకాష్ ఆమె గదిలో ఉన్నాడు.

"మళ్ళీ ఎందుకొచ్చావ్ ?" అందామె.

"ఈపాటికి నీభర్త నీకు బుద్ధిచెప్పి ఉంటాడని !"

ముక్త తెల్లబోయి - "ఆయనెందుకు నాకు బుద్ధి చెప్పాలి ?" అంది.

"అందమైన భార్యలు - భర్తల ప్రగతికి సోపానాలు..."

"ఆయనలాంటివారు కారు..."

"నువ్వసలతడికి చెప్పావా ?"

"లేదు..."

"నేననుకున్నాను. నువ్వు చెప్పలేవని !" అని భానుప్రకాష్ నవ్వాడు - "నీకూనాకూ మధ్యమాటల్లో నీ భర్తకు తెలియని రహస్యం యింతుంది -" అంటూ



చేతులతో అభినయించి చూపించి - "చేతల్లోకూడా యింత రహస్యమూ ఉంటే బాగుంటుంది. నీకు రహస్యం దాచడం బాగా చేతనవును..." అన్నాడు.

ముక్త నెమ్మదిగా - "నీకు దణ్ణం పెడతాను. వెళ్ళిపో -" అంది.

"వెళ్ళను...."

"వెళ్ళకపోతే నీ భార్యకు ఫోన్ చేస్తాను..."

"నిరంభ్యరంతరంగా చేయి. ఇప్పుడే చేయి. ఆమె యింట్లోనే ఉంటుందిప్పుడు. నీకు గుర్తులేకపోతే నంబరుకూడా నేనే యిస్తాను..."

"ఏమిటి నీ ధైర్యం ?" అంది ముక్త తెల్లబోయి.

"ఇందులో ధైర్యమేమీలేదు. నా సంస్కారం. నా భార్య నన్నే నమ్ముతుంది. నిన్ను నమ్మదు. నీక గొప్పదనుకుంటున్న నీ సంస్కారం గురించి ఆలోచించుకో.... నీ భర్తకు మనమిలా కలుసుకున్నామని నువ్వు చెప్పుకోగలవా ? అతడు నిన్ను నమ్ముతాడా ?"

ముక్త ఆలోచిస్తోంది. తను భర్తకితడి విషయం చెప్పాల్సింది. కానీ ఎందుకు చెప్పలేకపోయింది ?

గౌతమ్ భావిజీవితం గురించి కలలు కంటున్నాడు. ఆ కలల ధోరణిలో వాస్తవాన్ని పట్టించుకోవడంలేదు.

ఇప్పుడు తనకారణంగా బాస్‌తో గొడవ పెట్టుకుందుకతడు సిద్ధపడవచ్చు. కానీ ఆ తర్వాత జీవితాంతం తనను సాధిస్తూంటాడు - నీ కారణంగా నా భవిష్యత్తు నాశనమయిందని.

ముందే చెబితే వినిపించుకోలేదు. ఇప్పుడు చెబితే ముందే ఎందుకు చెప్పలేదంటాడు.

తామిద్దరూ ఒకరికొకరెంతో దగ్గరయ్యారు. కానీ తానతడి సంస్కారాన్ని నమ్మడంలేదు. లోపమెక్కడుంది ?

"మన సమాజంలో ఆడది ఆడది కావడం కారణంగా బలహీనురాలు. నువ్వు నువ్వు సంస్కారమంటున్నది సంస్కారం కాదు. మగాడినన్న ధైర్యం !"

భానుప్రకాష్ తమాషాగా నవ్వి - "వచ్చే జన్మంటూ ఉంటే ఆడదానిగా పుట్టించమని దేవుణ్ణి కోరుకుంటాను. ఎందుకో తెలుసా ? ఆడదానికి అందమొక్కటి చాలు. ఏమైనా సాధించగలదు. సంధ్య నీకంటే విశేషమైన వ్యక్తికాదు. చెప్పాలంటే ఆమెకు నీకున్నంత అందం లేదు. అయినా ఆమె నాకు భార్యకావడంవల్ల నీకంటే గొప్పదయింది. సంధ్యకంటే ముందు నీవంటిదాన్ని చూసివుంటే - బహుశా ఆమెను పెళ్ళాడి ఉండేవాణ్ణికాదు. ఏది ఏమైనా మగాడి పరిస్థితి అంత సులభం కాదు. అతడు ప్రగతిని సాధించాలంటే సమర్థుడుండాలి. ఎలాంటి సమర్థతంటే - తను కోరినవి సాధించడమేకాదు. తను కోరుకుంటున్న యువతి భర్తకి కూడా అన్నీ సాధించి పెట్టాలి...." అన్నాడు.

ముక్త అతడిమాటలు వింటూ– "రోజురోజుకూ ఇతడుమితిమీరి పోతున్నాడు. ఎలా ఇతడినాపడం ?" అనుకుంది.

తాను వివాహిత. స్వతంత్రురాలు.

అయినా ఒక పరాయి మగాడు తనపట్ల కోరికను వ్యక్తపరుస్తూంటే తన్ని తగలేయలేక పోతోంది.

"మిస్టర్ భానుప్రకాష్ ! మావారి ఉద్యోగమేమైనా నాకు ఫరవాలేదు. నీవిక నా దగ్గరకు రావద్దు. మరోసారి వస్తే నిన్ను నేనల్లరి పెట్టాల్సి ఉంటుంది..."

భానుప్రకాష్ లేచి నిలబడి – "నేను నిన్ను కలుసుకుందుకు రాను. అది నీ. అదృష్టం కాదు. దురదృష్టం–" అన్నాడు.

"దురదృష్టానికి నేను భయపడను..."

"అది కాలమే చెబుతుంది. కానీ ఒకవిషయం గుర్తుంచుకో .... సిరిరా మోకా లడ్డుకున్నావు...."

"సిద్ధార్థా వచ్చే సిరికి నా మోకాలెప్పుడూ అడ్డమే !"

"ఆవేశంలో నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలియడంలేదు. నేనెవరో తెలుసుకోలేక పోతున్నావు. అది నీకు తెలిసేలా చేస్తాను...."

"నీ బెదిరింపులకు నేను భయపడను..."

"నాకు నీమీద జాలిగా ఉంది. అభిమానం పొంగుతోంది. అందుకే వద్దన్నా మరో అవకాశం యిస్తున్నాను. అదేనీకు ఆఖరి అవకాశం..."

"నాకే అవకాశాలూ వద్దు..."

"వద్దన్నా యిస్తున్నానని ముందే చెప్పాను. ఈ రోజుకు సరిగ్గా వారంరోజులు అంటే వచ్చే మంగళవారం – మధ్యాహ్నం మూడుగంటలకు ... సరిగ్గా మూడు గంటలకు .... నువ్వు నా యింటికి రావాలి. అప్పుడింట్లో నేను, సంధ్యమాత్రం ఉంటాం. సంధ్యను కలుసుకోవాలన్న వంకతో నువ్వు మా యింటికొస్తావు. నిద్ర మాత్రల ప్రభావంతో సంధ్య నిద్రపోతూంటుంది. నేను నిన్ను బలాత్కారం చేయను. ఒక్కమాటకూడా అనను. సంతోషంతో నిన్ను నువ్వు నాకర్పించుకోవాలి...."

"అలా ఎన్నటికీ జరుగదు..."

"నేను వెడుతున్నాను. మంగళవారం మాయింట్లో కలుసుకుందాం ..." అని వెళ్ళిపోయాడు భానుప్రకాష్.

## 13

టూర్నించి బుధవారం సాయంత్రానికి భార్యాభర్తలిద్దరూ తిరిగివచ్చి యిల్లు చేరుకున్నారు.

భర్తకు విషయం చెప్పాలని ముక్త ఎన్నోసార్లనుకుంది. కానీ ఈ విషయం చెప్పడానికి తనకీ అతడికీ మధ్య ఎంతో దూరముందనిపిస్తోందామెకు.

ఇంతకాలం తనకీ అతడికీ రహస్యాలు లేవనుకుందామె. ఇద్దరికీ మధ్య చను



వుందనే భావించిందామె.

తాను చనువనుకుంటున్నది చనువుకాదు.

భర్తకుకూడా చెప్పుకోలేని రహస్యాలు తనకేర్పడ్డాయి. అందుక్కారణం అతడేనన్న అనుమానమామెలో ఉంది. ఆ అనుమానం అతడినే అడిగి తీర్చుకునే చనువునామె చూపలేక పోతోంది.

గురువారం నాడామె సంధ్యకు ఫోన్ చేసింది. సంధ్య ఆమెను స్వంత చెల్లెలిలా ఆప్యాయంగా పలకరించి విశేషాలడిగింది.

ముక్త భానుప్రకాష్ ప్రసక్తి తీసుకుని వచ్చింది.

"వారిగురించి నాకేమీ చెప్పొద్దు. నాకు నచ్చదు...." అందామె.

"నచ్చినా నచ్చక పోయినా నిజం తెలుసుకోవాలి నువ్వు..."

"తామరపువ్వు అందాన్ని చూసేటప్పుడు దానికింద బురదను చూడను. గులాబిని చూసి ఆనందించేటప్పుడు దానిచుట్టూ ఉండే ముళ్ళను గురించి ఆలోచించను నిజం ఒకోసారి బురదకన్నా అసహ్యంగా ఉంటుంది. ముళ్ళకన్నా తీవ్రంగా బాధి స్తుంది. మూణ్ణాళ్ళ ముచ్చటైన ఈ జీవితంలో సంతోషంగా ఉండడానికది అబద్ధ మైనా సరే – ఆశ్రయించడం తప్పుకాదు. నాకు తెలిసినదబద్ధమైనా అందమైనది. నీకు తెలిసినది నిజమైనా – నాకది వద్దు. ఏమీ చెప్పొద్దు–" అంది సంధ్య.

"కానీ – నువ్వు నన్ను రక్షిస్తానని మాటిచ్చావు...."

"నీవు కోరే రక్షణ నా భర్తనుంచే అయితే అది నీకవసరం లేదు. వారి సంగతి నాకు బాగా తెలుసు. నా ఆలోచనలు తప్పయితే సరే – తప్పక నేను నిన్ను రక్షించగలను. ధైర్యంగా ఉండు. వారినుంచి నీకేప్రమాదమూ ఉండదని నేను హామీ యిస్తున్నాను..."

"థాంక్స్ – అక్కా !" అంది ముక్త అప్రయత్నంగా.

"ఇంతకీ ఏం జరిగింది ?"

ముక్త చెప్పాలనే అనుకుంది. చెప్పలేదు.

విషయం సంధ్యకు తెలిస్తే ఆమె భర్తను నిలదీస్తుంది. అతడు గౌతమ్‌పై అలుగుతాడు.

అలిగితే ఏం జరుగుతుంది ?

సాయంత్రం కొంత అర్థమయింది ముక్తకు.

గౌతమ్ ఇంటికి పెందరాళే వచ్చాడు. వచ్చినవాడు ముభావంగానూ, దిగులు గానూ ఉన్నాడు.

టూర్లో ఉన్న ఉత్సాహమిప్పుడు లేదు.

"అలాగున్నారేం ?" అంది ముక్త.

"జీవన్మరణ సమస్య !"

"ఏమయింది ?"

"కాసేపు నన్ను మాట్లాడించకు..."

అతడు చిరాగ్గా ఉన్నాడని గమనించి ఊరుకుంది ముక్త.

కాసేపటికతడు తేరుకున్నాడు.

"దిక్కుమాలిన టూరు - నా కొంపముంచింది..."

"ఏం జరిగింది ?"

"బాస్ నాకు స్వతంత్రంగా పని చెప్పాడనుకున్నాను. కానీ అది నిజం కాదు. ఆయనకూడా నాకు తెలియకుండా వచ్చి గెస్ట్‌హౌస్‌లో ఉన్నాట్ట..."

ముక్త తడబడుతూ - "ఎందుకు ?" అంది. ప్రశ్న వేయగానే అతడేంచెబుతాడోనని ఆమె కంగారు.

విషయమతడికి తెలియనంతవరకూ ఏమైనా ఆలోచించవచ్చు. అతడికి చెప్పాలనికూడా అనుకోవచ్చు. కానీ అతడికి తెలిసిపోతే ... ఆ తర్వాత ...

"బాస్ నన్ను పరీక్షించాలనుకున్నాడు...."

"ఎలా ?"

మళ్ళీ ముక్త గుండెలో భయం, వణుకు...

అయితే అతడు చెప్పింది వేరు.

బాస్ తన ఉనికిని గౌతమ్‌కు తెలియనివ్వలేదు. గౌతమ్ ఒక పార్టీతో మాట్లాడేక తనూ వెళ్ళి ఆ పార్టీతో మాట్లాడేడు. గౌతమ్ వ్యవహరించిన తీరును తెలుసుకున్నాడు. పార్టీనే గౌతమ్ గురించిన అభిప్రాయమడిగాడు.

"మీ బాస్ గెస్ట్‌హౌస్‌లో ఉంటే నాక్కనబడాలిగా...." అంది ముక్త. దీనికతడి బదులేమిటోనని ఆమె భయంగానూ, ఆత్రుతగానూ ఎదురు చూస్తోంది.

"నీకెందుక్కనబడతాడు ? నీక్కనబడితే నాకు చెబుతావు. అప్పుడు తన రహస్యం బైటపడి పోతుంది...."

ముక్త తేలికగా నిట్టూర్చింది.

కానీ గౌతమ్ కంగారు పోలేదు.

"పార్టీ నామీద సదభిప్రాయాన్ని వెలిబుచ్చలేదుట. ఇలాంటి మనిషిని పంపిస్తే మీ కంపెనీ దెబ్బతింటుంది- అన్నాట్టాయన. ఈ రోజు బాస్ నామీద మండిపడ్డాడు...." అన్నాడతను.

"మండిపడితే రాజీనామా చేయాల్సింది-" అంది ముక్త.

"ఓ క్షణంలో నాకూ అలాగే అనిపించింది. ఎందుకో బాస్ ఈరోజు నామీద ఉగ్రరూపం చూపించాడు. గతంలో మెచ్చుకున్న వర్కునుకూడా ఈరోజు తప్పు పట్టాడు. నాకు బొత్తిగా ఏమీ రాదన్నాడు. నాకు ప్రాముఖ్యతనిచ్చి తప్పు చేశానన్నాడు..."

"ఈ ఉద్యోగం వద్దండీ - రాజీనామా చేసేయండి..." అంది ముక్త.

"నేను చెప్పేది పూర్తిగా విను..." అన్నాడు గౌతమ్.



"ఇంకా ఏం వినాలి ?" అంది ముక్త.

"వినాలిమరి -" అంటూ మొదలు పెట్టాడు గౌతమ్.

బాస్ గౌతమ్ మీద చాలా ఆశలు పెట్టుకున్నాడు. ఊళ్లో అతడికో పెద్ద బంగళా తీసుకోవాలనుకుంటున్నాడు. కంపెనీ తరఫునించి కారివ్వాలనుకుంటున్నాడు. కారు గురించి ఆర్డరు కూడా వెళ్ళి పోయింది. బంగళా విషయం మాటల్లో ఉంది. బాస్ అంబతియాలో నాలుగున్నాయి. వాటిలో ఒకటి కంపెనీ లీజుకు తీసుకుంటుంది.

"బాస్ నాకు అయిదురోజులు టైమిచ్చాడు ..." అన్నాడు గౌతమ్.

"దేనికి ?"

"టూర్లో జరిగిందానికి - నా ప్రగతికి కనెక్షనుంది ..." అన్నాడు గౌతమ్.

ఉలిక్కి పడింది ముక్త. - "అలాగని మీబాస్ అన్నాడా?"

"తెలుస్తూనే ఉందిగా ... పైగా ఆయనంటాడు - టూర్లో ఏం జరిగిందో నీ భార్యతో క్షుణ్ణంగా చర్చించు. ఆమె కూడా చదువుకున్నదే కదా ! ఒకసారి ఆడాళ్ళకుండే వ్యవహారజ్ఞానం మగాళ్ళ కుండదు. నువ్వు చెప్పిందంతావిని ఆమె నీకు సాయపడే సలహా లివ్వగలదు - అన్నాడు -"

"నేను మీ కెలాసాయపడగలను ?"

"మొత్తం వ్యవహారమంతా చెబుతాను. నేనేం చేశానో చెబుతాను నా వల్ల లోపమెక్కడ జరిగిందో నువ్వు నాకు చెప్పాలి. అందుకు బాస్ నాకు అయిదురోజులు టైమిచ్చాడు ..."

"అయిదురోజులంటే ... ?"

"వచ్చే మంగళవారం ..."

ఉలిక్కిపడింది ముక్త. అంటే భానుప్రకాష్ రంగంలోకి దిగేడన్నమాట !

"ఇలా షరతులు పెట్టేచోట మీ రెందుకు పని చేయాలి ? నా మాటవిని మరో ఉద్యోగానికి ప్రయత్నించండి ..."

"ఇంతకంటే మంచి ఉద్యోగం దొరకదు ముక్తా !" అన్నాడు గౌతమ్ విచారంగా.

"సమర్థతంటూ ఉంటే ఎందుకు దొరకదు ?"

"మన దేశంలో సమర్థతకు విలువేముంది ? సమర్థతకే విలువిస్తే ఈ కంపెనీలో నాకుద్యోగం దొరికేదో లేదో...రికమెండేషన్‌మీద నేనిది సంపాదించుకున్నాను"

"పోనీలెండి - మనకూ కారూ, బంగళాలూ వద్దు ..." అందిముక్త.

"అసలు విషయం నీకు తెలియడంలేదు..."

"ఏమిటది ?" అంది ముక్త. అసలు విషయం ముక్తకు తెలుసు. అది భర్తకు తెలుసునో తెలియదో ఆమెకు తెలియదు.

"మా ఆఫీసులో బాలచంద్రబాబు నీకు తెలుసుగదా !"

"ఎవరూ ?" అంది ముక్త.

ఇప్పుడామెకతడి మాటలు కోపం తెప్పించడంలేదు.

"రమంటే నాకు మోజు లేదు. వచ్చిన అవకాశాన్నుపయోగించుకున్నాను. నువ్వంటే నాకాకర్షణ ఉంది. అవకాశాన్ని నువ్వుపయోగించుకో..."

ముక్త అతడి మాటలు వింటోంది. తనేం చెప్పడం లేదు.

"ఈరోజంతా బాగా ఆలోచించుకో. ద్రౌపతికి అయిదుగురు భర్తలు. ఆమె పతివ్రత. అహల్యను భర్తకాక ఇంద్రుడు కూడా అనుభవించాడు. ఆమె పతివ్రత. శ్రీకృష్ణుడిని ప్రేమించింది రాధ. ఆమె ప్రేమ కథలకు ఆదర్శం. శీలం, పవిత్రత కవుల కలాల్లో ఎలాంటి మలుపులైనా తిరిగి ఎలాంటి అర్థాలైనా సంతరించుకుంటాయి నువ్వు తప్పు చేయడంలేదు. వచ్చిన అవకాశాన్నుపయోగించుకుంటున్నావు. నేనో విలనైతే నువ్వు పతివ్రతవు. భర్తకోసం శీలాన్నే త్యాగంచేయనున్న మహాపతివ్రతవు. తప్పు నీ ఆలోచనలో ఉంది తప్ప - చేతలలో లేదు. నామాట విను. నీభర్తను నిరుత్సాహపరచకు. రేపటి కన్ని ఏర్పాట్లూ జరుగుతున్నాయి. మనం తప్పక కలుసుకుంటాం...."

ముక్త ఫోన్ పెట్టేసింది.

వెంటనే మళ్ళీ ఫోన్ రింగయింది.

ముక్త ఫోన్ తీయలేదు.

ఫోన్ ఆగకుండా రింగవుతూనే ఉంది.

చివరకు ముక్త విసుగ్గా ఫోన్ తీసి - "హలో !" అందామె.

"ముక్త - నువ్వేనా - నేను గౌతమ్‌ని...."

ముక్త తృళ్ళి పడింది - "హలో - మీరా !" అందామె.

"అవును - ఎన్ని సార్లు ఫోన్ చేసినా ఎంగేజ్ రింగిస్తోంది. చివరికి లైన్ దొరికితే నువ్వోపట్టాన ఫోన్ తీయలేదు...."

"ఏమిటి విశేషం ?"

"విశేషమే - ఈరోజు నాకు మళ్ళీ టూరుంది, సామాను సర్దిఉంచు. కార్లో వస్తాను...సరిగ్గా నాలుగింటికి..."

"నేను రాలేనండీ -" అంది ముక్త అప్రయత్నంగా.

"నువ్వు కాదు. ఈసారి నేనొక్కణ్ణే. ఇదినాకు పరీక్ష సమయం. రెండు పార్టీలతో డీల్ చేయాలి. రేపుసాయంత్రం ఆరింటికి సరాసరి ఆఫీసులో నన్ను కలుసుకుంటాడుబాస్ ... ఈ సారి బాగాడీల్ చేయగలననే అనుకుంటున్నాను ..."

"అంటే ఊరికెడుతున్నారన్నమాట"....

"ఊఁ నీకేమనిపిస్తోంది ? అంతాబాగా జరుగుతుందంటావా ?"

"నేనేం చెప్పగలను ?"

"చెప్పగలవు. నువ్వు నా అదృష్ట దేవతవు ...."

అతడలాగనగానే - "అందమైన భార్యలు - భర్తల ప్రగతి సోపానాలు -"



అన్న భానుప్రకాష్‌మాట ముక్త చెవుల్లో గింగురు మంది.

"చెప్పు - ముక్తా !

"అన్నీ మీకేతెలుసు. మీకంటే నాకేమీ ఎక్కువ తెలియదు ..."

"అలాకాదు. అంతా నేనకున్నట్టే జరుగుతుందని చెప్పు ..."

"సరే - అంతా మీరనుకుంటున్నట్టే జరుగుతుంది ..." అనేసి - తానెవరికో అమ్ముడు పోయినట్లు ఫీలయింది ముక్త.

"థాంక్స్ - ముక్తా ! కార్లోవస్తాను. ఎంత సేపుండను ...."

"సరే - ..."

ఫోన్ పెట్టేశాడు గౌతమ్.

ఆ తర్వాత అతడికారు సరిగ్గా టైముకి వచ్చింది. గౌతమ్ లోపలకు వచ్చాడు.

అతడు టెన్షన్లో ఉన్నాడని గ్రహించింది ముక్త.

"అలాగున్నారేం - ఫ్రీగా ఉండండి ...." అందామె.

"బాలచంద్రరావు వచ్చేశాడు. చాలా హుషారుగా ఉన్నాడు బాస్‌కూడా అతణ్ణి అందరి ఎదుటా మెచ్చుకున్నాడు ...."

"అయితే ?"

"ఈ మిషన్లో నేను ఫెయిలయితే - రేపట్నించి అతడే నాకుబాస్ -" దిగులుగా అన్నాడు గౌతమ్.

"అలా దిగాలు పడకండి - బాలచంద్రరావు మీకు జూనియర్‌గానే ఉంటాడు. అతడికి ప్రమోషన్ వచ్చినా - మీరతడికంటే పైనే ఉంటారు...."

"ఎలా చెప్పగలవు ?"

"ఈ విషయం నేను మీ అదృష్ట దేవతగా చెబుతున్నాను..."

"నిజంగా -" అన్నాడు గౌతమ్.

అప్పుడతడి ముఖంలో పసిబాలుడి అమాయకత్వం, ఆత్రుతతో కూడిన సంతోషం కనబడింది ముక్తకు.

"ఊఁ" అందామె.

గౌతమ్ తృప్తిగా వెళ్ళిపోయాడు.

కారు కనుమరుగయ్యేదాకా చూసి తలుపులేసుకుంది ముక్త. ఆమె సరాసరి పడక గదిలోకి వెళ్ళి మంచంమీద పడుకుంది.

ఆమె మెదడునిండా ఆలోచనలు...

తనేంచేయాలో నిర్ణయించుకుందామె....

తన నిర్ణయం తప్పుకాదని ఆమె మనసును సరిపెడుతోంది.

సంప్రదాయం ఓ పట్టాన అందుకంగీకరించడంలేదు.

మనసు ద్వైదీభావంలో ఊగిసలాడుతోంది.

ఏం చేయాలన్నది కాదామె సందేహం.

తను చేస్తున్నది తప్పా, కాదా ? - అదీ ఆమె సందేహం.

తప్పు చేశాక తన మానసిక స్థితి ఎలాగుంటుందో తెలియదామెకు. కానీ ఆమె ఆలోచనల్లోకి భానుప్రకాష్ వస్తున్నాడు. భర్త స్థానంలో అతడినూహించుకుంటే జుగుప్సాకరంగా ఉందామెకు.

అజంతా ఇంటర్నేషనల్ గురించి విందామె.

రేపు భానుప్రకాష్ ఇల్లొక అజంతా ఇంటర్నేషనల్.

అక్కడ తనకుతానే వెడుతుంది - భర్త ప్రమేయం లేకుండా !

కానీ - నిజానికిందులో అతడి ప్రమేయం లేదా ? తెరమరుగున ఉండి అతడు నిర్వహిస్తున్న పాత్ర ఏమిటి ?

అతడికి తెలియకుండానే భానుప్రకాష్ ఈ ఏర్పాట్లన్నీ చేయగల్గుతున్నాడా ?

అప్పుడో విచిత్రమైన ఆలోచన కలిగింది ముక్తలో.

భానుప్రకాష్, గౌతమ్ స్నేహితులు. స్నేహితుడిద్వారా గౌతమ్ తన శీలాన్ని పరీక్షిస్తున్నాడు.

రేపు భానుప్రకాషింట్లో గౌతమ్కూడా ఉంటాడు.

అప్పుడు.....?

అక్కడ గౌతమ్ ఉంటాడని ఆమె మనసొప్పుకోవడంలేదు. కానీ భానుప్రకాషింటికి వెళ్ళడానికామె మనసు పూర్తిగా సిద్ధపడుతోంది.

## 15

మంగళవారం మధ్యాహ్నం మూడుగంటలు.

ముక్త భానుప్రకాష్ంట్లో అడుగు పెట్టింది.

ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. కానీ ఆమె అడుగు పెట్టిన కొద్దిక్షణాల్లోనే ఎక్కణ్ణించో భానుప్రకాష్ ఆమె ముందు ప్రత్యక్ష మయ్యాడు.

"నీ పాదాలు చప్పుడు చేయడంలేదు. కానీ నీ తనువు పరిమళాన్ని నేనెంత దూరాన్నుంచైనా గుర్తు పట్టగలను..." అన్నాడు భానుప్రకాష్.

ముక్త ముక్తసరిగా నవ్వి - ఊపిరి విడిచింది.

"లోపలకురా -" అన్నాడతడు.

ఆమె అతడిననుసరించింది.

అతడు సరాసరి ఆమెను పడక గదిలోనికి తీసుకుని వెళ్ళాడు.

గదిలో డబల్‌కాట్ .... మంచమంతా పరిచిన మల్లెలు గుబాళిస్తున్నాయి.

ఆమె అతడివంక చూసింది.

అతడి ముఖంలో ఉత్సాహముంది.

ఆమె నిట్టూర్చి - "నేను వస్తాననుకున్నావా ?" అంది.

"ఊఁ"

"నీ దృష్టిలో నేను చౌకబారు దాన్ని. కదూ ?"



"కాదు -"

"మరి నేను వస్తానని ఎందుకనుకున్నావు ?"

"నాకు నా అదృష్టం మీద నమ్మకం ..."

ముక్త మాట్లాడలేదు.

"నీకు తెలియను. నువ్వు నాకొక అపూర్వ వరానివి ..."

"కానీ నువ్వేనాకు వరమిస్తున్నావు"

"నీకు వరమివ్వగలగడం నా అదృష్టం ..."

మంచానికి కాస్త దూరంగా కుర్చీలో కూర్చుందామె.

"అలా కూర్చో -" అంటూ మంచం చూపించాడతడు.

"అప్పుడే కాదు -" అందామె.

"ఎప్పుడైనా ఫరవాలేదు - అసలంటూ ఉంటే ..."

"నేనంటే నీ కెందుకింత ఆకర్షణ ?"

"నువ్వెందుకింత ఆకర్షణీయంగా ఉన్నావని అడగితే ఏం చెబుతావు ?"

"నాకేం తెలుసు ?"

"నావిషయమూ అంతే !"

ఇద్దరూ కాసేపు మాట్లాడకోలేదు.

"నీకు నేనంటేకాదు - ఆడవాళ్ళంటే ఆకర్షణ ! అందుకే రఘు తెలివిని మెచ్చుకుని నా తెలివిని ప్రోత్సహించావు ..."

భానుప్రకాష్ ముఖం గంభీరంగా అయిపోయింది - "ఇప్పుడలాంటి కబుర్లు వద్దు. సరదాగా మాట్లాడు కుందాం !

"సంధ్య ఏం చేస్తోంది ?"

"నిద్రపోతుంది. లేవడానికి కనీసమింకో మూడు గంటలు పడుతుంది -"

"ఇంట్లో ఎవరున్నారు ?"

"పని వాళ్ళకూడాలేరు. సంధ్య కాక మనమిద్దర మే ..."

"జరిగిందది సంధ్యకు తెలిస్తే ...."

"సంధ్యకు తెలియకూడనిది జరుగుతుందా ?"

"నేను వచ్చానుగా -" అంది ముక్త ఆమె కళ్ళలో నీళ్ళున్నాయి.

భానుప్రకాష్ ముఖం గంభీరంగా అయిపోయింది - "నేను ముందే చెప్పాను నువ్వు మనస్ఫూర్తిగా ఇక్కడికి రావాలని !"

"మనస్ఫూర్తిగానే వచ్చాను...."

"మరి కనులలో నీళ్ళు..."

ముక్త కొంగుతో కన్నీళ్ళు తుడుచుకుని - "ఇవి ఆనంద బాష్పాలు, నాకు ప్రమోషన్ వస్తుందని !" అంది.

"ముక్తా ! బాగా ఆలోచించుకో...నేను కసాయివాడినికాను. నీకిష్టం

నిన్ను సమీపించను. నీ భర్తకు ప్రమోషన్ కావాలి. నీకు వైభవం కావాలి. అందు కోసం నీకై నీవే నాదగ్గరకు వచ్చావు. నేను నీభర్తకే అపకారమూ చేయను అతడెప్పటిలాగే ఉంటాడు. అతడి ఉన్నతిని కోరుకుంటేతప్ప నీకిక్కడ నాతో అవసరం లేదు. ఉన్నదానికి మించిన ఆశ నిన్ను నా వైపు నడిపిస్తోంది. ఈ అభిప్రాయంతో నాకు చేరువైతేనే నాకు తృప్తి .." అన్నాడు భానుప్రకాష్.

"ఎందుకిప్పుడివన్నీ ?" అంది ముక్త.

" నా సంస్కారాన్నర్థం చేసుకో. నీతో ఏకాంతం లభించింది గెస్ట్‌హౌస్‌లో. అది నేనుపయోగించుకోలేదు. నీ అసహాయతనుపయోగించుకోవడం నా అభిమతం కాదు. నాకు నీ తనువు కాదు. నువ్వు కావాలి. నిండు మనసుతో నువ్వు నన్నాదరించాలి. అందుకే నేను నీకు టైమిచ్చాను. నీఅంతట నీవే నా యింటికి రావాలన్నాను. ఇప్పుడుకూడా చెబుతున్నాను ... విను ... నీకు నీభర్త ప్రగతి అవసరం లేదనుకుంటే వెంటనే తిరిగి వెళ్ళిపో. బాలచంద్రరావు అతడికి బాస్ కావచ్చు. కానీ నీభర్త జీతం తగ్గదు. ఆఫీసులో నేనల్లరి పెట్టడం, అవమానించడం జరగదు. ఆలోచించుకో! నీ నిర్ణయంమీద నీ భవిష్యత్తాధారపడి ఉంది. భవిష్యత్తును ప్రకాశవంతంగా చేసుకోవాలనుకుంటేనే యిక్కడుండు ... లేకుంటే ..."

ఆలోచిస్తోంది ముక్త.

కారు, బంగళా...

"నా అదృష్టదేవతవు నువ్వు..." అని పొగుడుతున్న గౌతమ్.

"నేను నా యిష్టంమీదనే వచ్చాను. నాభర్తకు ప్రమోషన్,వైభవం.– అన్నీ కావాలి ..."

భానుప్రకాష్ తను వెళ్ళి మంచంమీద కూర్చున్నాడు.

"ఇలా వచ్చి కూర్చో !" అన్నాడతను.

ముక్త తటపటాయిస్తూనే వెళ్ళి మంచంమీద అతడికికాస్త దూరంగా కూర్చుంది.

"నాకు నువ్వంటే గౌరవం నీ పొందు నా అదృష్టమన్న భావం ... ఇవన్నీ మరోసారి నిన్ను కోరవచ్చు. ఇదీ రోజుతో ఆగకపోవచ్చు ..."

"ఒక సారికే తప్పు ... ఆ తర్వాతెన్నిసార్లు జరిగినా ఆ తప్పు కొత్తది కాదు. పాతదే అవుతుంది ...."

"చాలా తెలుసుకున్నావు ..."

"నీ పరిచయం నా ఆలోచనల స్వరూపాన్ని మార్చేసింది. జీవితంలో పైకి రావడమే నా ఆశయం ..."

"చాలా సంతోషం ... అయితే ఇక తప్పు చేస్తానన్న భావం విడిచిపెట్టు..." అన్నాడు భానుప్రకాష్.

"అదెప్పుడో వదిలి పెట్టేశాను. కాబట్టే ఇక్కడకు రాగలిగాను."



"సరే – నాకానమ్మకం కలగాలికదా ! నేను నిన్ను తాకబోయే ముందు నాలో ధైర్యం కలగాలంటే – కాసేపు – నువ్వీ మంచంమీద పడుకో ... ఈగది ఈమంచం అంతానీదే నన్నట్లు ఫ్రీగా ...."

అతడి నోటిమాట పూర్తి కాగానే ముక్త పక్కకు జరిగింది. కాసేపామె ఇబ్బందిగా ఫీలయింది.

కాసేపు భానుప్రకాష్ కూడా మంచం మీదనే కూర్చున్నాడు. తర్వాత తనూ పడుకున్నాడు.

ఒకే మంచంమీద – ఒకరికొకరు అభిముఖంగా అతడు – ఆమె !

ఇద్దరూ వివాహితులే ....కానీ...

అతడామెకు భర్త కాదు. ఆమె అతడికి భార్యకాదు.

ఇద్దరూ ఒకరినొకరు చూసుకుంటున్నారు.

సంప్రదాయంలో పుట్టి పెరిగిన ముక్త – సంప్రదాయాన్ని కాదని – భర్తకు బదులు పరాయి పురుషుడి పొందుకోరుతుంది.

ఇద్దరూ ఒకరినొకరు చూసుకొంటున్నారు.

మెత్తటి పరుపులు...విరిసిన మల్లెలు...

అతడు...ఆమె ...

ఇప్పుడామె తప్పును గురించి ఆలోచించడంలేదు. ఆమె కళ్ళు భానుప్రకాష్‌లో పురుషుణ్ణి చూస్తున్నాయి.

ఆమె శరీరంలో సంచలనం ప్రారంభమయింది.

స్త్రీకి పురుషుణ్ణి చూస్తే కలిగే సంచలనమది !

కొద్ది క్షణాల క్రితం వరకు ఉన్న ద్వైదీభావాలామెలో లేవు.

అతడు తనచేతినామె నడుం మీద వేశాడు.

ఆమె అతడికి దగ్గరగా జరిగింది.

అతడు ఆమెకు దగ్గరగా జరిగాడు.

కౌగిలి...ఉక్కుసంకెలలా యిద్దర్నీ బిగించింది...

అతడి వీపు పడక గది గుమ్మానికభిముఖంగా ఉంది. ఆమె ముఖానికతడి ముఖం అడ్డు.

వెచ్చని ఊపిరి...

ఇద్దరూ కుడా గుమ్మంవద్దనిలబడిన సంధ్యను చూడ్డం లేదు.

సంధ్య ఆదృశ్యాన్నే చూస్తూ గుమ్మం దగ్గర నిలబడిపోయింది. ఆమె నిశ్చేష్టురాలయిందేమో !

కుసుమకోమలమైన ఆమె చేతులతణ్ణి తనలోకలుపుకోవాలన్న కోర్కెబలంతో వీపును హత్తుకుంటే –....

"ఎవరూ ?" అంది సంధ్య.

జంట ఉలిక్కిపడి విడిపోయింది. అయిష్టంగానే ఇద్దరూ లేచికూర్చున్నారు.

ఇద్దరూ సంధ్యను చూశారు.

భానుప్రకాష్ మంచం దిగి తప్పుచేసిన వాడిలా తలవంచు కున్నాడు.

చెదిరిన పైటను సవరించుకుంది ముక్త.

సంధ్య వారిని సమీపించి -"ఏమిటిది ?" అంది. ముక్తను పరీక్షగా చూస్తూ- "నువ్విలాంటి దానివను కోలేదు...." అంది

ముక్త మాట్లాడ లేదు.

"నీకేమయింది ? వళ్ళు కొవ్వెక్కిందా ? డబ్బు కావాల్సొచ్చిందా ?" అంది సంధ్య.

"మీవారినడుగు..."

"వారిసంగతినాకు తెలుసు. నీకైనువ్వు వారిని వలలో వేసుకో వాలను కోకపోతే - ఇలా మాయింటికే రావుగదా...."

ముక్త కేమనాలో తెలియాలేదు.

తనిలాపట్టుబడి సంజాయిషీ యిచ్చుకోవాల్సొంటుందని ఆమె ఊహించుకోలేదు. అతడు తన్ను మోసగించాడనీ - ప్రోత్సహించాడనీ ఎలా ఋజువు చేయగలదు. తనే వాళ్ళింటికి వచ్చి అతడి పడగ్గదిలో....

జరిగింది తల్చుకుంటుంటే జుగుప్సతో ఆమె శరీరం వణికిపోతోంది. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఎందుకీ కల్ల బొల్లి ఏడ్పులు....నాకాపురంలో నిప్పులు పోయాలని చూశావు కదూ ;" అంది సంధ్య.

ముక్త మంచందిగి నిలబడింది.

"ముందు చీర సరిచేసుకో -" అంది సంధ్య.

ముక్త చీరసరిచేసుకోలేదు. ఆమె ముఖం రెండు చేతులతోటి కప్పుకుని వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

"ఏడుపుతో నీ తప్పును కప్పిపుచ్చుకోలేవు..." అంది సంధ్య.

ముక్త తప్పును కప్పిపుచ్చుకోవాలని ఏడ్వడం లేదు. బాధ గొంతులోంచి ఏడుపు రూపంలో బైట పడుతోంది.

హఠాత్తుగా తనలో బలహీనత ప్రవేశించి తనతప్పు కోరిందని ఆమెకర్థమయింది. తానలా ఎలా మారిపోయిందో తెలియక తన్నుతానే అసహ్యించుకుంటూ బాధపడు తోందామె.

కాసేపటికామె ఏడుపు ఆగింది.

"అక్కా ! నావల్ల తప్పు జరిగింది కానీ తప్పు నాదికాదు. ఈ విషయం మీ వారినే అడుగు...." అంది ముక్త.

"మావారు నీయింట్లో పట్టుబడితే అది వారితప్పు. నువ్వు మాయింట్లో పట్టు



బడితే అది నీతప్పే అవుతుంది..."

"నన్ను క్షమించక్కా !"

"నీవంటివారిని క్షమించడం నాకలవాటే-కానీ నిన్ను నీవు క్షమించుకోగలవో లేదో ఆలోచించుకో...."

ముక్త మాట్లాడలేదు.

"అసహాయతతో తప్పుచేసిన పావనిని నువ్వు క్షమించలేవు. బలహీనతతో తప్పుచేసిన నిన్ను క్షమించుకోగలవా ?"

చెళ్ళున కొట్టినట్లయింది ముక్తకు.

"ఆడతనం పశుపుతనం - రెండూ కలిస్తే మగాడికి భరించలేనంత ఆకర్షణ. ఆ ఆకర్షణను విచ్చల విడిగా కొనసాగనిస్తే - ఈ సమాజం క్రమశిక్షణను కోల్పోయి ఆటవిక సామ్రాజ్యంగా మారిపోతోంది. స్త్రీ పురుష సంబంధాన్ని క్రమబద్ధం చేయ డానికి పెళ్ళి అనే సంప్రదాయం ఏర్పడింది. ఆ పెళ్ళి పవిత్రమైనది. స్త్రీ పురుష సంబంధాన్ని కేవలం ఒక జంటకే పరిమితం చేస్తూ నియమాలేర్పరచింది. మన సంప్రదాయంలో పెళ్ళికాని ఆడపిల్ల కొందరికే ఆడపడుచు - పెళ్ళయిన ఆడపిల్ల - అందరికీ ఆడపడుచు. ఆడతనాన్ని పడుచుతనాన్ని కలిపి ఆడపడుచు అనే పదం తయారు కావడం మన సంప్రదాయంలోని ప్రత్యేక విశేషం. పెళ్ళయిన ఆడది - ఇతర స్త్రీలందర్నీ ఆడపడుచులుగా భావించి సానుభూతితో అర్థం చేసుకోవాలి. భర్త తప్ప తక్కిన పురుషులందరికీ ఆడపడుచు కావాలి. ఇదీ మన సంప్రదాయం చెబు తుంది. స్వార్థపరులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఈ సమాజంలో, స్వార్థం మనసు చేసేదైనా ప్రోత్సహించే ఈ వాతావరణంలో - సంప్రదాయాన్ని పాటించడ మెంతో కష్టమైన విశేషం. అది గ్రహించి సంప్రదాయం పాటించలేక పోయిన పాటి వారిని సానుభూతితో అర్థం చేసుకోవాలి. సంప్రదాయం పాటించడానికి మనం కఠోర ప్రయత్నాలు చేయాలి. మన స్నేహం ఎప్పటిలాగే కొనసాగుతుంది. పావని నాదరించినట్లే నేను నిన్నూ ఆదరిస్తాను. నీ తప్పుకితరులను తప్పు పట్టకు. జరిగింది మర్చిపోయి ఇకముందిలాంటిది జరక్కుండా జాగ్రత్తపడు. ఈ ఒక్కరోజులో నీవు పాపాత్మురాలివి కాలేవు. ఈ రోజుకు ముందు నీవు పుణ్యాత్మురాలివీ కావు. అది గుర్తుంచుకుని మసల గలిగితే చాలు. ఇక నీవు వెళ్ళొచ్చు..."

ముక్త చీర సవరించుకుంది, నిండుగా పైట కప్పుకుంది. భారంగా అడుగులు వేస్తూ అక్కణ్ణించి వెళ్ళిపోయింది.

కార్లో లిఫ్టిస్తానని భానుప్రకాష్ అనలేదు.

కావాలని ముక్త అడగలేదు.

ఆమె వెళ్ళిపోగానే సంధ్య భర్త పాదాలకు వంగి నమస్కరించింది. అతడా మెను లేవదీస్తూ - "ఏమిటిది ?" అన్నాడు.

"మీవంటి మహాత్ముడి పాదాలకు వంగి నమస్కరించడానికి ముక్త వెళ్ళేవరకూ

ఆగాల్సొచ్చిందని బాధగా ఉంది–" అంది సంధ్య.

"నేను మహాత్ముడిని కాదు –" అన్నాడు భానుప్రకాష్.

"ముక్తకు నీతులు చెప్పే అర్హత నాకు లేదని తెలుసు. మిమ్మల్నామె తప్పు పడుతూంటే నిజం చెప్పకపోవడం తప్పనీ నాకు తెలుసు. కానీ మీ మాట పాటించాను. అందుకే కసీసం పాదాభివందనం..."

"భార్యాభర్తలమధ్య పాదాభివందనాలు సంప్రదాయంకావచ్చు. కానీ నాకవి నచ్చవు. నేను సంప్రదాయానికి వ్యతిరేకిని..."

"ఆ విషయం నాకు తెలుసు..." అంది సంధ్య. ఇప్పటికీ ఆమె మరచిపోలేని నిజం కళ్ళముందు కదలాడుతూనే ఉంది.

* * * *

ఎంబియ్యే చదువుతూ వాళ్ళింట్లో అద్దెకుండే వాడు భానుప్రకాష్. అతడు వారికి బాగా దూరపు బంధువు. తన మానాన తనుమసిలేవాడు తప్ప సంధ్యవంక కన్నెత్తి కూడా చూసేవాడు కాదు.

సంధ్యకో బావ ఉన్నాడు. అతడికి చదువురాలేదు, వృత్తి పనులు నేర్చుకుందుకిండస్ట్రియల్ ట్రయినింగ్ ఇన్‌స్టిట్యూట్ వెళ్ళివస్తూండేవాడు. గొప్ప ఇండస్ట్రియలిస్టు కావాలన్నదతడి కల. జీవితంలో అతడుపైకి రాలేడన్నది తల్లిదండ్రులక్కూడా తెలిసిన నిజం. అతడు సంధ్యను ప్రేమిస్తున్నాననేవాడు. ఏకాంతంలో ఆమెకు ప్రేమ కబుర్లు చెప్పేవాడు. ఆకబుర్లలో తననో సినిమా హీరోలా అభివర్ణించుకునేవాడు.

సంధ్య మనసు పరిపక్వత చెందలేదు. ఆమె అతడి మాటలు నమ్మింది. అతడి పట్లజాలితో తనూ ప్రేమిస్తూన్నాననే అనుకుంది.

వారి చనువునింట్లో ఎవరూ అనుమానించే వారు కాదు. అయింట్లో వారికేకాంత మసాధ్యమూకాదు.

ఆఏకాంతన్ని సంధ్యను వశపర్చుకొనేందుకుపయోగించుకున్నాడతడు.

ఆ లేత వయసులో సంధ్య అతడి మాటలు నచ్చేవి.

చూసే సినిమాలు, చదివే నవలలు – ఆమె కతడిలో హీరోని చూపించేవి.

అతడే తన భర్త అవుతాడనుకుందామె.

కానీ ఆమె సంప్రదాయాన్ని నమ్మింది. అందుకే అతణ్ణి తనకు దూరంగానే ఉంచేది.

బావ ఆమెనెన్నోవిధాల ప్రోత్సహించి విఫలుడయ్యాడు.

"ముందు మన పెళ్ళికావాలి –" అందామె అతడితో.

"మీ వాళ్ళకు నువ్వు చెప్పు..." అన్నాడతడు.

సంధ్య యింట్లో చెప్పాలనే అనుకుంది. కానీ అతడి గురించి అంతా పనికిరానివాడని అనుకుంటూంటే చెప్పలేకపోయింది.

"నువ్వేచెప్పు –" అంది సంధ్య.



"చెబుతాను –" అన్నాడతడు.

రోజులు గడుస్తున్నా చెప్పేధైర్యమతడికి రాలేదు.

"మన పెళ్ళి జరగాలంటే నాకు ధైర్యం కావాలి. నా ధైర్యం నీమీద ఆధారపడి ఉంది. నువ్వు నిజంగా నన్ను ప్రేమిస్తున్నావని నాకు తెలిస్తే ధైర్యం వస్తుంది–" అన్నాడతడు.

"నేను నిజంగా నిన్ను ప్రేమిస్తున్నాను...." అంది సంధ్య.

"అంటే చాలదు. ఋజువుండాలి, ఋజువుంటేనే ధైర్యం..."

"భగవంతుడు స్త్రీని ప్రేమమయిని చేశాడు. సృష్టిలో స్త్రీ స్వార్థపరురాలే కావచ్చు. కానీ ఆమె స్వార్థం తనగురించి కాదు. తనవారి గురించి...."

స్త్రీ తనకంటె ఎక్కువగా తనవారిని ప్రేమిస్తుంది.

బావ తనవాడనే సంధ్య అనుకుంది. ఋజువుకోసం ఆమె అతడికి లొంగిపోయింది. ఒక కన్నెపిల్ల లేత హృదయపు బలహీనతనామె బావ అందుకున్నాడు.

అయినా అతడికి ధైర్యం చాలలేదు.

ఇంకా ధైర్యం కావాలన్నాడతడు.

మొదటిసారి ఉన్న ప్రతిఘటన భావం కూడా లేదు సంధ్యలో రెండోసారి. అయితే ఈసారి దొంగలు పట్టుబడిపోయారు.

"ఎన్నాళ్ళనుంచి జరుగుతోందిది!" అంటూ తల్లి సంధ్యనూ, తండ్రి సంధ్య బావనూ నిలదీశారు.

సంధ్య హడలిపోయింది.

సంధ్య బావ యింట్లోంచి పారిపోయాడు.

ఇంట్లో సంధ్య పెళ్ళిగురించి హడావుడి ప్రారంభమైంది.

సంప్రదాయాన్ని నమ్మిన సంధ్యకు తనపెళ్ళి బావతో జరగాలని ఉంది. కానీ "ఆ భ్రష్టుడితో దీని పెళ్ళి చేయను–" అన్నాడు తండ్రి.

సంధ్య మనసు వికలమై పోయింది.

ఒకరోజామె ఆత్మహత్య చేసుకోబోయింది దొడ్లో బావిలో దూకి....

ఆ దృశ్యం భానుప్రకాష్ కంటబడింది. అతడామెను రక్షించాడు. ఆ విషయం ఎవరికీ తెలియదు.

భానుప్రకాష్‌కు చూచాయిగా ఇంట్లో జరిగింది తెలుసు. అతడు సంధ్యను నిలదీసి అడిగి నిజం తెలుసుకున్నాడు.

సంధ్య తను బ్రతకనని ఏడ్చింది. అతడామెను మందలించి – "నువ్వతణ్ణి ప్రేమిస్తున్నావా?" అనడిగాడు.

"నన్నతడు ప్రేమిస్తున్నాడు –" అని చెప్పింది సంధ్య.

పారిపోయిన ఆమె బావను భానుప్రకాష్ కలుసుకొని సంధ్యను పెళ్ళి చేసుకోమని చెప్పాడు.

"దాని శీలం మంచిది కాదు -" అన్నాడు సంధ్య బావ - ఆమెను పెద్దలకు తెలియకుండా పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేక.

భానుప్రకాష్ సంధ్యకీవిషయం చెప్పి -"అతడు నిన్ను ప్రేమించడం లేదు జరిగింది మర్చిపో -" అన్నాడు.

"జరిగింది మర్చిపోలేను. వేరే వ్యక్తిని వివాహమాడి అతడి జీవితన్ని నరకం చేయలేను -" అంది సంధ్య.

"మన సంప్రదాయం ఆడదాన్ని అన్నింటికీ దోషిని చేస్తుంది. జరిగిందానికి దోషం నీతోపాటు నీబావకు సమంగా అంటుతుంది. నేనీ సంప్రదాయానికి వ్యతిరేకిని ఒక చిన్న పొరపాటు వల్ల కోల్పోయే పవిత్రత పవిత్రత అనిపించుకోదు. నేను నిను పెళ్ళి చేసుకుంటాను. జాలితో కాదు - ప్రేమతో! అందువల్ల లాభమేమిటంటే - నీ కథ పూర్తిగా నాకు తెలుసు కాబట్టి ముందు నీ బావ కూడా నిన్ను బ్లాక్ మెయిల్ చేయ లేడు...."

సంధ్య ఈపెళ్ళికి అన్యమనస్కంగా ఒప్పుకుంది. ఆమె తలిదండ్రులు మహదానందంతో అంగీకరించారు.

పెళ్ళైనా సంధ్య మామూలు మనిషి కాలేక పోయింది.

"నా ప్రవర్తనలో ఏదో లోపముంది. నేను కులటను. బావ నన్ను ప్రోత్సహించినా - అందుకు నాసహకారము ఉంది -" అనేదామె తరుచుగా.

"పరిస్థితులు తోడైతే పతివ్రతలు కూడా తప్పు చేస్తారు..." అనేవాడు, భానుప్రకాష్ ఆమెతో.

సంధ్య నమ్మాలనే అనుకుంది.

మన చుట్టూ సమాజం, అందులో ముఖ్యంగా ఆడవాళ్ళు - ఆమెకు తప్పు చేసిందన్న భావాన్ని కలిగిస్తూండేవారు. పాపనిపంటి స్త్రీలనందరూ, ముఖ్యంగా స్త్రీలు నిరసిస్తూంటే ఆ నిరసన నామె తనకే అన్వయించుకుంటోంది.

"మీరు పవిత్రురాలైన మరో యువతిని పెళ్ళాడండి. నేను అనుమతినిస్తాను. మీ సంతానానికి తల్లినయ్యే అర్హత నాకులేదు-" అందామె భర్తతో.

"పురుషస్పర్శ నెరుగని నీవు, లేతవయసులో - ఒకస్వార్థపరుడి ప్రోత్సాహంతో - అతడికి దగ్గరై తప్పు చేశానుకుంటున్నావు, అదేతప్పు - కేవలం డబ్బు కోసం, పదవికోసం - వివాహితురాలైన ఆడది - తన యిష్టంమీదనే చేయగలదని నేను ఋజువు చేస్తాను. అప్పుడైనా నువ్వు నీ - గిల్టీ కాన్షస్ వదిలి పెట్టాలి ..." అన్నాడు భానుప్రకాష్.

ఆ ఎన్నికను కూడా అతడు భార్యకే వదిలి పెట్టాడు.

ఆమె ముక్తనెన్నుకుంది. ముక్త చేత భర్త తప్పుచేయించ గలిగితే - తన తప్పు సాధారణమైనదే అనిపించుకుంటుందని ఆమె ఒప్పుకుంది.

భానుప్రకాష్ తన ప్రయత్నాలు ప్రారంభించాడు.

* * * *



"ముక్త నాకు నీ అంతదగ్గరగానూ వచ్చింది. కాని నిజం చెబుతున్నాను. నేను నీ మీద ప్రేమతో నటిస్తున్నాను తప్ప - ఆమెపై నాకెప్పుడూ కూడా దురూహ కలుగ లేదు. అదీ నా గొప్పతనం .... ముక్త నాకు - ఎప్పటికీ ఆడపడుచే!" అన్నాడు భానుప్రకాష్.

"మిమ్మల్ని నేనెప్పుడూ నమ్ముతాను ..." అంది సంధ్య.

సంధ్య భానుప్రకాష్‌ని నమ్మింది. కానీ మగాళ్ళందరూ భానుప్రకాష్‌లు కారు.

ఆడ పడుచు పదాలనుండి ఆడపడుచన్న పవిత్ర పదాన్ని సృష్టించిన మన సంప్రదాయాన్ని పాటించలేక పోయిన ఆడపడుచుల పట్ల సానుభూతినీ జతపరచ మన్న విన్నపమూ, పురుషులందరూ భానుప్రకాష్‌లు కాదన్న హెచ్చరికా - ముఖ్యంగా, ఆడపడుచులందరికీ ఈకథద్వారా అందితే - ఈ రచన ప్రయోజనం నెరవేరినట్లే!

(అయిపోయింది)